

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విశాఖపట్నం సంపుటి : 60 సంచిక : 320 • పేజీలు : 8 • సోమవారం 12 ఆగస్టు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati

- ఎపిలో తీర ప్రాంతాలలో హై అలెర్ట్ ప్రకటించిన అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి రామానాయుడు వెల్లడి
- వర్షాలతో కృష్ణ, తుంగభద్ర, కావేరి వంటి నదులలో పోటెత్తుతున్న వరద
- ప్రజలను అప్రమత్తం చేసేలా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ
- కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- తుంగభద్రా డ్యాం గేటు తెగి నీళ్ళు దిగువకు..
- అధికార యంత్రాంగం అలెర్ట్..
- గరిష్టస్థాయికి చేరుకున్న ఆనకట్టలు
- అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లు సంప్రదించాలని సూచన





# ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

## తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయిన సంఘటనపై చంద్రబాబు సమీక్ష

**అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక) :** కర్ణాటక రాష్ట్రంలో భారీ వర్షాలతో కృష్ణానది వరద ఉప్పొంగుతోంది. తాజాగా కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అనూహ్య సంఘటనలో ఒక్కసారిగా పోటెత్తిన వరద ధాటికి తుంగభద్ర డ్యామ్ గేటు ఒక్కసారిగా తెగి వేల క్యూసెక్కుల నీరు దిగువకు పోటెత్తింది. ఫలితంగా దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీర ప్రాంతాలలో హై అలెర్ట్ ప్రకటించారు అధికారులు. తుంగభద్రా డ్యాం గేటు తెగి నీళ్ళు దిగువకు కర్ణాటక రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో కృష్ణ, తుంగభద్ర, కావేరి వంటి నదులలో వరద పోటెత్తుతోంది. ఆయా నదులపై కట్టిన ఆనకట్టలు గరిష్ట నీటి స్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో జల వనరుల శాఖ అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదే క్రమంలో తుంగభద్ర రిజర్వాయర్‌కు చెందిన తెగి గేటు విరిగిపడి కొట్టుకుపోయింది. 35 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు పోటెత్తుతోంది. ఇక ఈ క్రమంలో తుంగభద్ర డ్యామ్ గేట్ కొట్టుకుపోయిన సంఘటనపైన ఏపీ జలవనుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించారు. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయిన సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారని మిగతా 7లో

## 109 రకాల కొత్త వంగడాలు

# విడుదల..



**ఢిల్లీ,ఆగస్టు 11:**ఎటువంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకునే 100 రకాల పంటల కొత్త వంగడాలను ప్రధాని మోదీ విడుదల చేశారు. ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూషన్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వంగడాలు, సేంద్రియ వ్యవసాయ మిగతా 7లో

## పోల్ సర్వేల్లో కమలా హారిస్ దూకుడు?





- ట్రంప్‌కు 46 శాతం మద్దతు.. కమలాకు 50 శాతం మద్దతు..

**వాషింగ్టన్,ఆగస్టు 11:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో అని ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని మిగతా 7లో

## కూలిపోయిన ట్రైనీ విమానం



**భోపాల్,ఆగస్టు 11 :** మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో ప్రైవేట్ ఏవియేషన్ అకాడమీకి చెందిన ట్రైనీ విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు గాయపడినట్లు పోలీసు అధికారులు తెలిపారు.రెండు సీట్లున్న సెస్నా 152 విమానం ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు కూలిపోయింది. సుమారు 40 నిమిషాల పాటు గాలిలో ఉన్న విమానం ఇంజన్ వైఫల్యం కారణంగా కూలిపోయినట్లు మిగతా 7లో

## నా ఫోన్ హ్యాక్ అయింది..

- ఎంపీ సుప్రియా సూలే



**ముంబై, ఆగస్టు 11 :** ఎన్సీపీ( శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే తన మొబైల్ ఫోన్, వాట్సాప్ హ్యాక్ అయినట్లు తెలిపారు. ఆదివారం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని ఆమె వెల్లడించారు.'అర్జెంట్: నా మొబైల్ ఫోన్, వాట్సాప్ హ్యాక్ అయింది. దయచేసి బారామతి ప్రజలు ఎవరూ నాకు కాల్స్ లేదా మిగతా 7లో

## హసీనా సంచలన ఆరోపణలు

- బంగ్లాదేశ్‌లో ఇలాంటి పరిస్థితికి అమెరికానే కారణం



**బంగ్లాదేశ్,ఆగస్టు 11 :** బంగ్లాదేశ్‌లో అల్లర్ల వేళ అక్కడ అలాంటి పరిస్థితులకు గల కారణాలను వెల్లడించారు బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా. బంగ్లాదేశ్‌లో తమ ప్రభుత్వం పడిపోవడానికి అమెరికానే కారణమని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. బంగాళాఖాతంలో ఉన్న సెయింట్ మిగతా 7లో

## నిండుకుండలా సాగర్

# జలాశయం

- నాగార్జున సాగర్‌కు వచ్చిన పర్యాటకులకు తప్పని నిరాశ..
- తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు
- అధికారులపై పర్యాటకులు ఆగ్రహం,అసహనం వ్యక్తం..



**అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక) :** నాగార్జునసాగర్‌లో కృష్ణానది హొయలను చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో సాగర్ పరిసరాలన్నీ కిట కిటలాడాయి. ఎన్నో ఆశలతో ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌కు వచ్చిన మిగతా 7లో

## నవ దంపతులకు

# శుభవార్త




- పెళ్లి సర్టిఫికెట్ సమర్పిస్తే కొత్త రేషన్ కార్డులు
- పాత కార్డులు మార్చి కొత్త కార్డులు ఇవ్వడానికి రంగం సిద్ధం
- రేషన్ కార్డులపై కీలక ప్రకటన చేసిన మంత్రి నాదెండ్ల

7లో

## దేశంలో మరిన్ని ఎయిర్‌పోర్టులు

# అవసరం



**విజయనగరం,ఆగస్టు 11 ఆంధ్రపత్రిక) :** జిల్లాలోని భోగాపురం వద్ద నిర్మాణం జరుగుతున్న అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం పనులు జరుగుతున్న తీరును బట్టి అనుకున్న సమయం కంటే ముందు గానే పూర్తిచేయగలమనే నమ్మకం తమకుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారు. వాస్తవానికి డిశంబరు మిగతా 7లో

- ఎయిర్ పోర్టు నిర్మాణం పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయి..
- భోగాపురం ఎయిర్ పోర్టు పనులు 36.6 శాతం పూర్తి
- అనుకున్న సమయం కంటే ముందే పూర్తి చేసేందుకు అధికంగా అవకాశాలు
- నిర్మాణం పనుల పురోగతిపై ప్రతి నెలా సమీక్షిస్తాం
- ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే శక్తి ఈ ఎయిర్ పోర్టుకే ఉంది..
- విమానాశ్రయ పనులను పరిశీలించిన రామ్మోహన్‌నాయుడు

## మంత్రి అనితకు తప్పిన

# ప్రమాదం



- ప్రమాదానికి గురైన హోంమంత్రి అనిత కారు
- స్వల్పంగా దెబ్బతిన్న మంత్రి కారు, ఎస్కార్ట్ వాహనం
- అనంతరం మరో వాహనంలో వెళ్లిన అనిత

**అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక) :** అనిత ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితకు ప్రమాదం తప్పింది. బైక్‌ను తప్పించే క్రమంలో మంత్రి ఎస్కార్ట్ వాహన డ్రైవర్ మిగతా 7లో

## చంద్రబాబూ..రైతుల బాధలు

# పట్టవా..?

- ఉచిత పంట బీమా ప్రీమియంను ఇప్పటివరకూ చెల్లించని కూటమి సర్కార్
- రైతుల పట్ల చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్య వైఖరి
- వెంటనే ఉచిత పంటల బీమా ప్రీమియం తక్షణమే చెల్లించాలని జగన్ డిమాండ్
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని గుర్తుపెట్టుకోండి చంద్రబాబూ..
- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



**అమరావతి,ఆగస్టు 11(ఆంధ్రపత్రిక) :** రైతుల పట్ల చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్య వైఖరిని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎక్స్(ట్విటర్) వేదికగా నిలదీశారు. 2023 -24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంట బీమా ప్రీమియంను మిగతా 7లో

## వచ్చిన వినతులను

# పరిష్కరిస్తాం

- వైకాపా హయాంలో భూములు అన్యాక్రాంతం
- తప్పులు చేసిన వారిని వదిలేది లేదు
- ఇప్పుడు ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే చర్యలు
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**అమరావతి,ఆగస్టు 11(ఆంధ్రపత్రిక) :** సచివాలయంలో ఆనం రామనారాయణరెడ్డి దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు మిగతా 7లో

## వెంటనే న్యాయం

# జరగాలి..!



- 12న దేశవ్యాప్తంగా వైద్య సేవల నిలిపివేత : ఫోర్డా
- దారుణ హత్యకు గురైన జూనియర్ వైద్యురాలు..
- దారుణ హత్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలి
- కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రికి లేఖను పంపించిన ఫోర్డా

**కోల్‌కతా,ఆగస్టు 11 :** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జ్ కార్ మెడికల్ కళాశాలలో జూని యర్ వైద్యురాలి దారుణ హత్యపై రెసిడెంట్ డాక్టర్లు తీవ్రంగా స్పందించారు. సోమవారం దేశవ్యాప్తంగా కొన్ని రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫోర్డా మిగతా 7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్
ఆంధ్రపత్రిక
వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

# ఉభయ పౌరసత్వం!

తాజా నివేదిక ప్రకారం అమెరికాలో నివసిస్తున్న మన భారతీయుల్లో 65,960 మందికి అగ్రరాజ్య పౌరసత్వం అధికారికంగా అందుబాటులోకి వచ్చింది. అనేకమంది మనవారు అక్కడ ఎప్పటి నుంచో నివసిస్తున్నా అందరికీ అక్కడి పౌరసత్వం లేదు.మనదేశంలో పుట్టి అక్కడ జీవిస్తున్నవారిలో దాదాపు 42 శాతం మందికి అక్కడి పౌరసత్వం పొందే అర్హత లేదని సీ ఆర్ ఎస్ నివేదిక తెలుపుతోంది.2023 నాటికి గ్రీన్ కార్డ్ లేదా లీగల్ పర్మినెంట్ రెసిడెన్సీ వున్న 2,90,000 మందిభారతీయులకు సహజ విధానంలో పౌరసత్వం పొందే అవకాశం వుందని చెబుతున్నారు.కొత్తగా 65,960 మంది అధికారిక అమెరికా పౌరులయ్యారు. అగ్రరాజ్య పౌరసత్వం పొందాల్సిన మనవాళ్ళు ఇంకా చాలామంది వున్నారు.అమెరికాలో నివసిస్తున్న విదేశీయులు ఆ దేశ జనాభాలో 14శాతం వున్నట్లు అమెరికన్ కమ్యూనిటీ సర్వే డేటా చెబుతోంది.గతంతో పోల్చుకుంటే అమెరికాలో నివసించే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరిగింది.సాఫ్ట్ వేర్ రంగం పెరుగుతున్న కొద్దీ మనవాళ్ళ సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. విద్యార్థులు కూడా పెరుగుతున్నారు. తెలుగువారు కూడా బాగా పెరుగుతున్నారు.1.35 శాతంతో దాదాపు 50లక్షల మందికి పైగా మనవారు అగ్రరాజ్యంలో నివసిస్తున్నారు.17 వ శతాబ్దం నుంచే మనవాళ్ళు అమెరికాకు వెళ్తున్నారు, కొందరు అక్కడే జీవిస్తున్నారు.వాళ్ళ అవసరాల కోసం మనవారిని వాళ్ళ సేవకులుగా తీసుకెళ్లడం అప్పటి నుంచే ప్రారంభమైంది."వాళ్లు సేవకులు కాదు బానిసలు" అని మన చరిత్రకారులు అంటున్నారు.ఈస్ట్ ఇండియా కంపెనీ వారు మనవారిని వాళ్ళ కాలనీలకు తరలించుకొని తీసుకెళ్లారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇది మరో రూపం తీసుకకుంది.కొంతమంది ఉపాధి కోసం, కొంతమంది విద్య కోసం అమెరికా బాట పట్టారు. ఈ నాలుగు దశాబ్దాలలో ఆ సంఖ్య క్రమంగా గణనీయంగా పెరిగింది.1900 ప్రాంతంలో సిక్కులు ఎక్కువగా కాలిఫోర్నియా ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తోంది.స్వామి వివేకానంద చికాగో ప్రయాణం, ఉపన్యాసం పెద్ద ప్రభావాన్ని చూపించింది.వేదాంత సొసైటీ స్థాపనకు దారితీసింది.సిక్కులను కూడా అమెరికాలో ఒకప్పుడు హిందువులనే పిలిచేవారు.ఒక దశలో,భారతదేశం నుంచి వలసలను అరికట్టాలని కూడా అమెరికా చూసింది.ఇమిగ్రేషన్ చట్టాన్ని మరింత బలంగా నిర్మాణం చేయడంతో మన వాళ్ళ అమెరికా వలసలు తగ్గిపోయాయి. 1920ప్రాంతంలో భారతీయ అమెరికన్ల జనాభా కేవలం 6,400.ప్రస్తుతం 50లక్షలు. ఈ వందేళ్లలో మనవాళ్ళ జనాభా ఎన్నిరెట్లు పెరిగిందో? దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు.మన జనాభా పెరగడానికి కారణాలలో విద్య ప్రధానమైంది.దానికి మూలం మన ప్రతిభ.1920ల్లో మన ప్రతిభ చూపించి వాళ్ళను గెలిచినవారిలో మన యల్లాప్రగడ సుబ్బారావు పేరెన్నిక కన్నవారు.గోవింద్ బిహారీ లాల్ కూడా చాలా గొప్పవారు.జర్నలిజంలో ప్రతిష్ఠాత్మకమైన పులిట్జర్ పురస్కారాన్ని పొందిన తొలి భారతీయుడు. అక్కడి నుంచి మొదలైన మన భారతీయ ప్రతిభా ప్రయాణం నేడు ఐటీ దిగ్గజాలు సత్య నాదెండ్ల, సుందర పిచ్చయ్య వంటివారు వరకూ సాగింది. మన దేశ మూలాలు కలిగిన కమలా హ్యారిస్ ప్రస్తుతం అగ్రరాజ్య ఉపాధ్యక్షురాలుగా పదవిని అలంకరించారు. బానిసల గతి నుంచి బాసుల స్థాయికి మన భారతీయులు ఎదగడం గర్వకారణం. వ్యాపార, వాణిజ్యాలలో మనవారు అక్కడ అద్భుతంగా రాణిస్తున్నారు. మానవవనరులలో మనది గౌరవనీయమైన స్థానం.వైట్ హౌస్ లోనూ మనవారి ప్రాతినిధ్యం పెరుగుతోంది.అమెరికా ఎన్నికల్లో ఆర్థిక సహాయం అందించేవారిలో మనవాళ్ళు కీలకంగా వున్నారు. కాకపోతే,రాజకీయ భాగస్వామ్యంలో మాత్రం వెనుకబడి వున్నారు.అమెరికాలో ఓటు హక్కున్న మనవాళ్ళు చాలామంది అస్సలు ఓటే వెయ్యరు. ఇది ఏ మాత్రం ఆహ్వానించదగిన విషయం కాదు.ఎన్నికల్లో నిలుచుండే అభ్యర్థులకు డబ్బులిస్తే సరిపోదు.ఎన్నికల్లో నిలబడాలి, ముఖ్యంగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి.సాఫ్ట్ వేర్ రంగం తాజాది.వైద్యం,విద్య,పరిశోధన,మార్కెటింగ్ విభాగాల్లోనూ మనవాళ్ళు గౌరవనీయమైన సంఖ్యలోనే వున్నారు.అంతర్జాతీయ సంబంధాలలో అమెరికా ఒకప్పుడు పాకిస్తాన్ కే ఎక్కువ మద్దతు చూపించేది.పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా అధికారం పీఠం ఎక్కిన తర్వాత మన విదేశాంగ విధానంలో కొత్త వ్యూహాలు అల్లడం మొదలుపెట్టారు. అందులో అమెరికా బంధాలు కీలకమైనవి.చైనాతో ఎప్పటికైనా ఇబ్బందులు వస్తాయని ఆయన ముందే గ్రహించి ఈ అడుగు వేశారు. మన్ మోహన్ సింగ్ అదే బాటలో నడిచారు.నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయ్యాక సరికొత్త రూపును తెచ్చారు. ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ తో వ్యక్తిగత స్నేహాన్ని నెరిపారు.ట్రంప్ ఎన్నికలకు అమెరికా వెళ్లి ప్రచారం చేసి వచ్చారు. ట్రంప్ ను ఇండియా ఆహ్వానించి గుజరాత్ లో లక్షమందితో పెద్ద సభ ఏర్పాటుచేసి,ట్రంప్ ను తన్మయంలో మునకలు వేయించారు. అమెరికాలో ప్రధానంగా వున్న రాజకీయ పార్టీలు రెండు. ఒకటి డెమోక్రటిక్ పార్టీ , రెండోది రిపబ్లికన్ పార్టీ.మనవాళ్ళు మొదటి నుంచి ఎక్కువ శాతం సహజంగా డెమోక్రటిక్ పార్టీకి మద్దతు అందించారు.క్రమంగా రిపబ్లికన్ పార్టీ వైపు కూడా మొగ్గు చూపడం ప్రారంభించారు.ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ సమయంలో ఈ పరిణామం జరిగిందని అంటారు.బిల్ క్లింటన్, బరాక్ ఒబామా నుంచి జో బైడెన్ వరకూ అమెరికా అధ్యక్షులుగా పనిచేసినవారు భారతదేశం పట్ల ప్రత్యేక ప్రేమ చూపించి నట్లు కనిపించినా, వారి ప్రేమ ఒకింత పాకిస్తాన్ వైపే ఎక్కువగా ఉండేదని కొందరు వ్యాఖ్యానిస్తారు.వీరితో పోల్చుకుంటే డోనాల్డ్ ట్రంప్ కు భారత్ పట్ల ఆకర్షణ, అనురాగం ఎక్కువని కొందరు అంటారు.రేపు జరుగబోయే ఎన్నికల్లో ట్రంప్ – బైడెన్ మధ్య హోరాహోరి పోరు వుంటుందని ముందుగా అందరూ అంచనా వేశారు. బైడెన్ పోరు నుంచి విరమించుకొని, కమలాహ్యారిస్ ను దింపారు.వీరిద్దరి గెలుపుపై మిశ్రమ విశ్లేషణలు వెలువడుతున్నాయి.హ్యారిస్ కు భారతీయ మూలాలు ఉన్నప్పటికీ,ఆమె కంటే ట్రంప్ వల్లనే మనవాళ్ళకు ఎక్కువ మేలు జరుగుతుందని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. మనది ప్రపంచంలోనే అతి పెద్ద మార్కెట్. మనతో అగ్రరాజ్యానికి చాలా అవసరం వుంది. గతంతో పోల్చుకుంటే మన అవసరం ఆ దేశానికి పెరుగుతోంది.అమెరికా – భారత్ మధ్య వాణిజ్య, వ్యాపారాలు పెరుగుతున్నాయి. ఇంకా పెరగాల్సి వుంది.పెట్టుబడులు కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో, అక్కడ నివసించే మన వారికి పన్నుల రాయతీలోనూ,వ్యాపార ప్రోత్సాహకాలలోనూ,పౌరసత్వ కల్పనలోనూ, రాజకీయ భాగస్వామ్యంలోనూ ఇంకా సహకారం ఎంతో పెరగాల్సి వుంది.ఇమిగ్రేషన్, వీసాల అనుమతులు,ఉద్యోగాల కల్పనలో అగ్రరాజ్యం ఇంకా ఉదారంగా వ్యవహరించాలి.మనవాళ్ళ పట్ల మరింత ప్రజాస్వామ్యం పెరగాలి. ప్రస్తుతం,అమెరికాలో కీలక భూమిక పోషిస్తున్న భారతీయులు భవిష్యత్తులో మరింత కీలకమైన వ్యక్తులుగా, వ్యవస్థలుగా మారతారని నిస్సందేహంగా చెప్పవచ్చు. అగ్రరాజ్యంలో భారతీయుల అధికారిక అమెరికా పౌరుల సంఖ్య భవిష్యత్తులో గణనీయంగా పెరుగుతుందని అంచనా వెయ్యవచ్చు.ఇప్పటికే పౌరసత్వం వున్న కొందరికి సంపూర్ణమైన స్వేచ్ఛ లేదు.దానికి కూడా పరిష్కారం లభించాలి.ఉభయ పౌరసత్వం ( అమెరికా – భారత్ ) పట్ల కూడా అడుగులు పడవచ్చు.కాకపోతే అందుకు అగ్రరాజ్యం ఒప్పుకున్నా, మన ప్రభుత్వం ఏ మేరకు సుముఖంగా వుంటుందో చెప్పలేం.మరి కొన్నాళ్ళలోనే అగ్రరాజ్యంలో రాజెవరో?రెడ్డెవరో? తేలిపోతుంది.

# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి

## ఆగస్టు 12... జాతీయ గ్రంథాలయ దినోత్సవం

భారత దేశంలో అకడమిక్ లైబ్రరీలతోపాటు, పబ్లిక్ లైబ్రరీలలో అభివృద్ధికి, గ్రంథాలయ వ్యవస్థ వికాసానికి విశేషంగా కృషి చేసిన ఎస్.ఆర్ రంగనాథన్ పుట్టినరోజైన ఆగస్టు 12న జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా ప్రకటించి దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు.లెక్కల ప్రొఫెసరైన డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ 1923లో మద్రాసు యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా చేరాడు. తనకు దొరికిన ఈ అవకాశాన్ని అనుకూలంగా మలుచుకొని గ్రంథాలయ వ్యవస్థకు సంబంధించిన ప్రపంచవ్యాప్త ధోరణులను పరిశీలించి, 1924లో క్లాసిఫికేషన్, 1933లో గ్రంథాలయ కేటలాగుల్ని తయారు చేయడానికి ఒక కొత్త కోడ్‌ను రూపొందించాడు. కోలన్ క్లాసిఫికేషన్ అని పిలిచే ఈ వర్గీకరణ పద్ధతిని దేశంలోని అనేక గ్రంథాలయాలు అనుసరిస్తున్నాయి. పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, పెంపొందించడం, పిల్లలతో బాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యం వైపు ఆకర్షించడం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి ?వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారు మ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు.మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం.అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలం లోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణం



గానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్థాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపంచంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# పెద్దలు కుదిర్చిన పెళ్ళీలకు మొగ్గు చూపుతున్న యువత

" భారతీయ సమాజంలో పెళ్ళికి చాలా ప్రాధాన్యత వుంది .పెళ్లంటే నూరేళ్ల పంట వంశాభివృద్ధికి పునాది.ఇద్దరు వ్యక్తుల మధ్య శారీరక మానసిక ఆత్మ సంబంధమైన అన్యోన్య బంధమే పెళ్ళి .పెళ్లి అనేది భాగస్వాముల మధ్య ప్రత్యేకమైన వ్యక్తిగత అనుభంధం ఏర్పడేందుకు పునాది.పరస్పరం ఒకరికి ఒకరు గౌరవించుకుంటు ఒకరిపై ఒకరు ఆధారపడి షరతులు లేని ప్రేమాభిమానాలతో సాగిపోయే జీవితానికి ఆహ్వానం పలికే ఒక మధురమైన సన్నివేశం పెళ్లి. "

### జీవితం పెళ్ళి

మనిషి జీవితంలో వివాహం ప్రధాన ఘట్టం పెళ్లి తో మనుషుల జీవితాలలో కొత్త మలుపు మొదలవుతుంది.. పెళ్లి కుటుంబ వ్యవస్థ ఏర్పాటుకు సమాజ నిర్మాణానికి పునాది .రెండు కుటుంబాల మధ్య వారధి.

### ప్రేమ పెళ్లి పెద్దలు చేసిన పెళ్ళి

భారత దేశములో పెద్దలు కుదిర్చిన పెళ్ళీలు మరియు ప్రేమ పెళ్ళీలతో జంటలు ఏకమౌతున్నరు.మతాలు ఏవైనా' కులాలు 'ఏవైనా పెళ్లి అనేది భాగస్వాములు జీవిత కాలం కలిసి ఉండాలన్నది ప్రధాన ఆశయం.గతంలో తల్లి తండ్రుల ఇష్ట ప్రకారం పెళ్ళిళ్ళు జరిగేవి. ఇప్పుడు పెళ్లికి ముందే యువతి యువకులు స్నేహాలు' ప్రేమలు డేటింగులు' షికార్లు తోగడుపుతున్న సందర్భాలు ఉన్నాయి.తెలిసి తెలియని ఉరకలు వేసే వయసులో
ఒకరికి ఒకరు ఇష్టపడి ప్రేమ మొదలై పెళ్లిళ్లకు దారితీస్తుంది. ఇద్దరి మధ్య జీవితం పై అవాగాహన లేక పెళ్లి ఐయిన కొద్ది రోజులకే విడాకులు తీసుకుంటున్న జంటలను ఈ సమాజంలో చూస్తున్నాం. దీనికి ప్రధాన కారణం సరైన గైడెన్స్ చెప్పే వారు లేక పోవడం. మెరుగైన సామాజిక సంభందాలు లేక పోవడం. సకాలములో పెద్దల సలహాలు సహకారం లోపించడం ప్రధాన కారణాలు.

### యువత ప్రేమ పెళ్ళిలు

భారతీయ యువత ప్రేమ పెళ్ళిల మీద శ్రద్ధ చూపుతున్నారు. యుక్త వయసులో తమకు కాబోయే జీవిత భాగస్వామి ఎంపికలో యువత వ్యక్తి గత స్వేచ్ఛ ఎంపిక పట్ల ఉత్సాహం చూపిస్తున్నారు. చిన్నప్పటి స్కూల్ కాలేజ్ క్లాస్ మట్ లను పెళ్లి చేసుకోవడంలో యువత తమ ఇష్టాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచీకరణ 'విదేశీ సంస్కృతి 'విదేశీ చదువులు' విదేశీ కొలువులు చేస్తూ కులాంతర వివాహాలు ప్రేమ వివాహాల వైపు మొగ్గు చూపే సంస్కృతి యువతలో రాజ్యమేలుతుంది.భారతీయ సినిమాలు చూస్తే ప్రేమ తప్ప మరొకటి కనిపించదు. యువత ఆలోచనలన్నీ ప్రేమ పెళ్లి చుట్టూనే తిరుగుతూ ఉంటాయని పిస్తుంది .అది కొంత వరకు వాస్తమే.

### పెళ్ళిలపై అధ్యయనం సర్వే

**దేశంలో ఇటీవల వివాహాల** స్వరూపం స్వభావం మీద జరిపిన అధ్యయనాల ప్రకారం యువత అధిక సంఖ్యలో పెద్దలు కుదిర్చిన వివాహలనే చేసుకుంటున్నారని తేలింది.2018 సంవత్సరం లో 1'60'000 కంటే ఎక్కువ కుటుంబాల పై జరిపిన సర్వేలో



వివాహితుల్లో 93 శాతం తమది పెద్దలు కుదిర్చిన వివాహమే అని చెప్పారు.కేవలం 3 శాతం మాత్రమే ప్రేమ వివాహం చేసుకున్నారు. మరో 2 శాతం ప్రేమ ప్లస్ పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్నారు అంటే పెద్దలే ఈ సంభ్నందాన్ని కలుపుతారు. పరిచయం అయ్యాక అబ్బాయి అమ్మాయి ప్రేమలో పడి పెళ్లికి ఒప్పుకుంటారు కాలముతో పాటు ఈ శాతాలలో పెద్దగా మార్పులేదు .
80 యేళ్లు దాటి వారిలో 94 శాతం మంది తమది పెద్దలు కుదిర్చిన వివాహం అని చెప్పారు20.యేళ్లు దాటిన వారిలో90 శాతం కన్నా ఎక్కువ జంటలు పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్న వారేనని అధ్యయనంలో తేలింది.

### ప్రేమ పెళ్లిలు తక్కువే

2014 లో 70000 కంటే ఎక్కువ మందిపై జరిపిన సర్వేలో పట్టణ ప్రాంతాల్లో నివసించే భారతీయుల్లో కులాంతర వివహాం చేసుకున్నవారు 10 శాతం కంటే తక్కువే అని తేలింది. మతాంతర వివాహం అంతకన్న తక్కువ కేవలం 5 శాతం మాత్రమేనని అధ్యయనాలు తెలుపుతున్నాయి.
కులాంతర 'మతాంతర 'వివాహాలు చేసుకోవడానికి అభ్యంతరం వ్యక్తం చేయని యువత వివాహ సమయంలో వివాహాం మాత్రం పెద్దలు కుదిర్చిన వారితోనే చేసుకుంటున్నారని తేలింది . పెళ్ళిల మీద జరిగిన పలు అధ్యయనాలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. వాస్త వానికి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న వివాహాల తీరుకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది.జనవరి 2018 నాటికి భారత దేశములో ప్రేమ వివాహాలు చేసుకున్న వారు 3 శాతం మందే అని సర్వేలో తేలింది .మంచి చదువు ఉద్యోగం చేస్తున్న ఒక దళిత యువకున్ని వివాహం చేసుకోవడానికి ముందుకు వచ్చే వారి సంఖ్య అతి తక్కువగానే ఉంటుంది.తెగించి పెళ్లి చేసుకుంటే కుటుంబ సభ్యుల భందువుల ద్వారా బెదిరింపులు తిరస్కారాలు సాంఘిక బహిష్కరణ' గృహ బహిష్కరణకు గురౌతున్నారు.పరువు కోసం ప్రాణాలను భలికొనే సంస్కృతి సామాజిక లక్షణంగా పరిణమించడం శోచనీయం.

### పరువు హత్యలు

ఇటీవలదేశంలో అనేక ప్రాంతాల్లో కులాంతర వివాహాలు చేసుకున్న జంటల పట్ల అమానుష అమానవీయ సంఘటనలు చోటు చేసు కుంటున్నాయి. పరువు హత్యలు సమాజానికి సవాళ్ గా పరిణమించాయి.ఇలాంటి పరిస్థతుల్లోయువతీ యువకులు మనసుకు నచ్చిన వారిని పెళ్లి చేసుకోవాలంటే పెద్ద యుద్ధమే చెయ్యలసి వస్తుంది.

### సొంత కులం వారితో పెళ్లి

2015లో మాట్రి మొనియాల్ సైట్లలో 1000మంది అమ్మాయిలను సంప్రదిస్తే సగం మంది కులాంతర వివాహాలకు అభ్యంతరం లేదని చెప్పిన చాలా వరకు అమ్మాయిలు వివాహ సమయంలో సొంత కులానికి చెందిన అమ్మాయిలను వివాహం చేసుకోవడానికి మొగ్గ చూపుతున్నారని సర్వేలోతేలింది.
,,..2013 సం"లో ఢిల్లీలో ఏడు జిల్లా కోర్టుల్లో అత్యాచారానికి సంబంధించిన కేసుల విచారణ జరిగింది. ప్రతి కేసులో విచారణ ముగిసిన 460 కేసుల్లో 40 శాతం సమ్మతి వున్న జంటలకు సంబందించిన కేసులు కావటం గమనార్హం.
కోర్టు విచారించిన 460 కేసుల్లో 40శాతం అమ్మాయి అబ్బాయి ఒకరికి ఒకరు ఇష్టపడ్డ కేసులే చాలా వరకు కులాంతర మతాంతర వివాహాలు చేసుకున్న వారే వాళ్ళు ప్రేమించుకొని ఇంటినుండి పారిపోయిన తర్వాత అమ్మాయి తల్లి తండ్రులు అబ్బాయి మీద అత్యాచారం అపహరణ కేసులు పెట్టారు.తమ బిడ్డ కులాంతర వివహం చేసుకుంది అనే దాని కంటే అత్యాచారానికి గురైంది అని చెప్పుకోవదానికి ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయని మానసిక స్థితికి తల్లి తండ్రులు గురౌతున్నారనీ సర్వేల్లో వెల్లడైంది.

### సామాజిక శాస్త్రవేత్తల ఆందోళన

తమ కంటే తక్కువ కులం అబ్బాయిని ప్రేమించిందని పరువు హత్యాలకు పాల్పడే ప్రమాదకర దోరుణులు ప్రభలి శాంతి భద్రతల సమస్యగాపరిణమించడం గమనార్హం .కులాల మధ్య కుమ్ములాటలు .కుల విద్వేషాలు చోటుచేసుకుని సామాజిక సమరసత కులాల మధ్య సంఘీభావం సామరస్యత దెబ్బతింటుంది. కులాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకోవడం సామాజిక శాంతికి విఘాతం కలు గుతుందని సామాజిక శాస్త్ర వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చట్టాలు శిక్ష

దేశములో రాను రాను పరిస్థితులు దిగజారే ప్రమాదం వుంది.కొన్నేళ్లుగా అతివాద హిందూ గ్రూపులు "లవ్ జిహాదీ" అనే పదం తెరపైకి వచ్చింది. పెళ్ళి పేరుతో అమ్మాయి మతం మార్పిడి చేసే అబ్బాయిలకు కటిన చట్టాలు శిక్షలు అమల్లోకి తేవటానికి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి.

### భార్య భర్తల ప్రేమ నమ్మకం

ప్రేమ పెళ్లి కాని పెద్దలు కుదిర్చిన పెళ్లి కాని కేవలం భార్య భర్తలపైనే ఆధారపడి ఉంటుంది.ముఖ్యంగా వారి మధ్య వున్న ప్రేమ నమ్మకం విశ్వాసం పరస్పరం కురిపించుకునే ప్రేమానురాగాలు ఈ విషయములో కీలక పాత్ర పోషిస్తాయి.జీవితం పంచు కోవడానికి తగిన వ్యక్తిని ఎంపిక చేసుకుంటే అది ప్రేమ వివాహమైన లేక పెద్దలు కుదిర్చిన వివాహమైన జీవితం అద్భుతంగా ముందుకు సాగుతుంది. పరస్పరం అవగాహన సహకారం మంచితనం ఆత్మీయత బంధువులతో మెరుగైన సంభందాలు కష్ట సుఖాలు పంచుకోవడం మంచిని పెంచడం కుటుంబ అభివృద్ధిలో భాగస్వాములు కావడం పండుగలు ఆత్మీయుల కలయికలు భందు వులతో సామూహిక పండుగలు జరుపుకోవడం .కుటుంబ పెద్దల పట్ల గౌరవం ఆత్మీయత అభిమానం అనురాగం ప్రేమ మెరుగైన జీవనవి లువలు కుటుంబాల సాంప్రదాయాన్ని ఆచారాలను పాటించాలి.

### ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

సమాజం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునర్జీవంతో వివాహ వ్యవస్థ పవిత్రతకు పునరంకితం కావాలి.మమత మానవీయత ఆదరణ ఆర్థత అనురాగాల ఆలంబనగా ఆదర్శనీయమైన జీవన శైలితోయువత వివాహ వ్యవస్థ పవిత్రత పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి.

నేదునూరి కనకయ్య

# జాతి నిర్మాణానికి యువ శక్తి కీలకం



జాతి నిర్మాణం లో యువత పాత్ర చాలా కీలకం అన్నది నిర్వివాదాంశం. సమాజ ప్రగతిలో యువత పాత్ర ప్రాధాన్యాన్ని గుర్తించి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 17 డిసెంబర్ 1999 న ప్రతి ఏటా ఆగస్ట్ 12 వ తేదీన అంతర్జాతీయ యువ జన దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించింది. 2000 సంవత్సరం నుంచి ఇది అమలు లోనికి వచ్చి, మొదటి అంతర్జాతీయ యువ దినోత్సవం 2000 ఆగస్టు 12 లో జరిగింది. ఐక్యరాజ్యసమితి యువత కోసం చేపట్టిన ప్రపంచ కార్యాచరణ కార్యక్రమం పట్ల యువతకు అవగాహన కలిగించేందుకు అంతర్జాతీయ యువ దినోత్సవాన్ని ప్రకటించింది. ఈ దినోత్సవమును జరుపుకోవడం వలన యువత దృష్టిని ఆకర్షించడం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. సాంస్కృతిక, చట్టపరమైన సమస్యల ద్వారా అపాయంలో చిక్కుకున్న జనాభాకు ఇటువంటి దినోత్సవాల అవసరం ఉంది. నేటి యువతే రేపటి భవిత అంటారు. యువతకు గల శక్తి అంతులేనిది, అపారమైనది. దేశ ఉన్నతికి, ఔన్నత్యానికి ఈ శక్తిని ఫణంగా పెడితే అన్నీ తిరుగులేని విజయాలే ఉంటాయి. వారి విజయాలు వ్యక్తిగతం మాత్రమే కాదు, సామాజికమైనవి. తద్వారా జాతీయం, అంతర్జాతీయం అయినవి. ఈ శక్తి ఎప్పుడూ అనుకూల పథం లో సాగాల్సి ఉంది. యువ శక్తి దేశానికి ఎంత మేలు చేస్తుందో .. గతి తప్పితే అంతకు రెట్టింపు కీడుచేస్తుంది .
నేటి తరానికి బాధ్యతలు గుర్తు చేసేందుకు , యువతకు గల శక్తిని చాటి చెప్పేందుకు గాను గత 22 ఏళ్లుగా అంతర్జాతీయ యువజనోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. సిబ్బంది అంతా ఒకే కార్యాలయంలో లేక కారానాలో కలిసి పనిచేసే రోజులు పోతున్నాయి. మేనేజర్ ఒకచోట ఉండి, వేర్వేరు ప్రాంతాల్లోని సిబ్బందితో పనిచేయించే రోజులు వచ్చాయి. సామాజిక మాధ్యమాల్లో, స్మార్ట్ ఫోన్లలో మాటామంతీ జరపడంలో ఆరితేరిన నేటి తరం, ఈ తరహా రిమోట్ నిర్వహణలో సులువుగా ఇమిడి పోగలుగుతుంది. ఆశలు, ఆశయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను గుర్తించి, వాటిని అధిగమించడానికి ఆచరణీయ ప్రణాళికలను చేపట్టడం ప్రభుత్వ విధి. కార్పొరేట్ రంగం కూడా యువ సిబ్బంది ఉద్యోగంలో, జీవితంలో విజేతలుగా ఎదగడానికి తోడ్పడే నిర్వహణ విధానాలను అనుసరించాలి. 21వ శతాబ్దంలో విజయ సాధన అంత తేలిక కాదని యువతరం అనుభవంలో తెలిసి వస్తున్నది. నేడు జీవితంలో రాణించాలంటే ఐఐటీ, ఐఐఎంల వంటి ఉత్కృష్ట విద్యా సంస్థల్లో పట్టభద్రులవక తప్పదనే భావన నెలకొంది. రేపటి కృత్రిమ మేధ యుగంలో భారత్ తరహా బట్టీ చదువులకు స్థానం ఉండదు. అలాంటి చదువులతో చేసే ఆనవాయితీ పనులను మనుషులకన్నా యంత్రాలే అత్యంత సమర్థంగా చేయ గలుగుతాయి. నాలుగో పారిశ్రామిక విప్లవానికి సృజనశీల విద్య చోదకశక్తి కానుంది. ఆ విప్లవంలో అగ్రగాములుగా ఎదగాలంటే అభ్యాస, ఆచరణలను అత్యుత్తమంగా మేళవించాలి. అటువంటి ఉత్తమ గుణ సమ్మేళనం జర్మనీ, ఫిన్లాండ్ వంటి దేశాల విద్యా విధానాల్లో కనిపిస్తున్నది. వాటి నుంచి ఇతర దేశాలు నేర్చుకోవలసింది ఎంతో ఉంది. మొక్కుబడి చదువులు, బట్టీయం చదువులకు మున్ముందు స్థానం ఉండదు. ఈ వాస్తవాన్ని గుర్తెరిగి విద్యార్థులు చొరవ, సృజన శీలతలను ఇనుమడింప జేసుకోవాలి. వారికి కావలసిన ప్రాతిపదికను తల్లిదండ్రులు, గురువులు, పాలకులు ఏర్పరచాలి. ఆ పని చేసినప్పుడు మాత్రమే యువతరం భారత సామాజిక, ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలుగా నిలబడగలుగుతుంది!

# నగరంలో జనసేన కార్యాలయం అట్టహాసంగా ప్రారంభోత్సవం

- ఆర్థిక రాజధానిగా విశాఖ
- దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్
- ఎమ్మెల్యేలు, పలువురు ప్రముఖుల తాకిడితో నూతన పార్టీ కార్యాలయంలో సందడిగా ప్రారంభోత్సవం
- భారీగా తరలివచ్చిన అభిమానులు, కూటమి శ్రేణులు
- పార్టీ శ్రేణులకు అందుబాటులో నగరంలో జనసేన పార్టీ కార్యాలయం

**విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రప్రత్రిక):**విశాఖ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి సాధిస్తుందని దక్షిణ నియోజక వర్గం శాసన సభ్యుడు , జనసేన నగర అధ్యక్షుడు వంశీ కృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక సీతమ్మపేటదరి రాజేంద్ర నగర్ లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన జన సేన పార్టీ కార్యాలయము ప్రారంబోత్సవ పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ప్రారంభోత్సవంలో ప్రముఖ డైరెక్టర్ మెహర్ రమేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యే గణబాబు పాల్గొని వంశీని అభినందించారు . విశాఖ పేదలు, పార్టీ వర్గాలకు ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ఇక్కడ నాయకులు అందుబాటు లో వుంటారు. రాష్ట్రంలో అద్భుతమైన పాలన సాగుతోంది. వైసిపి పాలనను ప్రజలు ఎలా ఓడించారు అన్నది తెలిసిందే. ప్రజలు రాష్ట్రంలో కూటమి విజయంతో దీపావళి చేసుకున్నారు. సిఎం చంద్రబాబు నాయుడు పాలన ఎలా వుంటుందో ప్రజలకు తెలిసిందే. ప్రధాని మోడీ సహకారంతో సు పరిపాలన చూపిస్తున్నారు. విశాఖ అభివృద్ధి కి బాటలు వేస్తున్నము. భోగాపురం ఎయిర్ పోర్టు, పోలవరం ప్రాజెక్టు సాకారం కానున్నాయి. విశాఖ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి సాధిస్తుంది. ప్రకృతి అందాల నిలయం విశాఖ. పారిశ్రామిక వేత్తలు కూడా ముందుకు వస్తున్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలు సాధనకు కృషి చేస్తాం. ఎమ్మెల్సీ ఎన్నికలు తరువాత వైసిపికి అమావాస్య వస్తుంది. ప్రజా వ్యతిరేకత వున్న దృష్ట్యా నే



వైసిపి నాయకులు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా కూటమి విజయం ఖాయం. జీవీఎంసి ఎన్నికల్లో టిడిపి విజయమే ఇందుకు నిదర్శనం. పోర్టు కాలుష్యం నివారణకు అడుగు పడింది అన్నారు. దక్షిణంలో రైతు బజార్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. డైరెక్టర్ మెహర్ రమేష్ మాట్లాడుతూ, విశాఖ దక్షిణ ఎమ్మెల్యేగా విజయం సాధించిన వంశీ కి అభినందనలు తెలిపారు. విశాఖను ప్రగతి పథంలో నడిపించే సత్తా వంశీకే వుంది. సినిమా రంగంలో కూడా విశాఖ ఎంతో అభివృద్ధి సాధిస్తుంది. ముంబాయి, చెన్నై మాదిరిగా సముద్రం వున్న విశాఖ లో కూడా సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తుందన్నారు. మీడియా సమావేశంలో జన సేన 33 వార్డు కార్పొరేటర్ బీసెట్టి వసంత లక్ష్మి, 39 వార్డు కార్పొరేటర్ సాధిక్, కార్పొరేటర్ గోవింద రెడ్డి, కార్పొరేటర్ బుజ్జి, ఉత్తర ఇంఛార్జి పీ.ఉషా కిరణ్, జనసేన 27 వార్డు అధ్యక్షుడు సురేష్, వేణు, భారీగా కూటమి శ్రేణులు, పాల్గొన్నారు.

# మేలైన ఔషధాలు అందించి కీర్తి పెంచాలి

- జేఎన్టీయు విసి మురళీ కృష్ణ



**కాకినాడ, ఆగస్ట్ 11(ఆంధ్రపత్రిక):**మేలైన ఔషధాలను అందుబాటు ధరలో వినియోగదారులకు అందించి కీర్తి ప్రతిష్టలు సొంతం చేసుకోవాలని జెఎన్టియు విసి డాక్టర్ కెవిఎస్జి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం కాకినాడ భానుగుడి సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన కీర్తి మెడికల్ స్టోర్స్ను విసి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి డాక్టర్ ముక్కు కవిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విసి మురళీకృష్ణ మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల్లో మేలైన ఔషధాలను అందించే కీర్తి మెడికల్ స్టోర్స్ నగరంలో ఏర్పాటు చేయడం ఆనందకరమన్నారు. ఇక్కడ అవసరమైనటువంటి జనరల్, బేబీ కేర్, సర్జికల్ వంటి మెడికల్ ఉత్పత్తులు అందించడం వీరి ప్రత్యేకత అని చెప్పారు. అతి తక్కువ లాభాన్ని గడిస్తూ అత్యధిక శాతం తగ్గింపును అందించి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న చైర్మన్ ఎల్ తిరుపతి రెడ్డిని అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైద్యులు చిట్ల కిరణ్, మూర్తి, సత్యప్రసన్ తదితరులు పాల్గొన్నారు. నాలుగు రాష్ట్రాల్లో అన్ని రకాల మందులు అందిస్తున్నామని తిరుపతి రెడ్డి చెప్పారు. లేని మందులను తీసుకొచ్చి వినియోగదారుని ఇంటికి ఇవ్వడమే తమ ప్రత్యేకతని తిరుపతిరెడ్డి తెలిపారు.

# కాకతాంబ నగర్‌లో క్రికెట్ అకాడమీ ప్రారంభం



**అనకాపల్లి ఆగస్టు 10 (ఆంధ్రపత్రిక):**స్థానిక డైట్ కళాశాల సమీపంలో ఉన్న కాకతాంబనగర్‌లో ఎస్‌విఎల్ క్రికెట్ అకాడమీ ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచనల మేరకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ పాల్గొని అకాడమీని ప్రారంభించారు. ఈ మేరకు అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రతిభ కేవలం తల్లిదండ్రులకే కాకుండా అనకాపల్లి జిల్లాకు కూడా గుర్తింపు తీసుకువచ్చేలా క్రీడల్లో ప్రత్యేక పాత్రపోషించాలని ఆకాంక్షించారు. అదే విధంగా భవ్యశ్రీ డెవలపర్స్ అధినేత కాండ్రేగుల నాయుడు మాట్లాడుతూ క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు పేద విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలనే ఆలోచన అభినందించతగ్గ విషయమన్నారు. ఇటువంటి సేవ చేయాలనే ఆలోచన అకాడమీ వ్యవస్థాపకుడు ఆడారి సతీష్‌కు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనకాపల్లికి ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా క్రీడాకారులు తమ ప్రతిభను కనబరచాలని పిలుపునిచ్చారు. అనంతరం అకాడమీ వ్యవస్థాపకుడు సతీష్ మాట్లాడుతూ క్రికెట్‌లో మన ప్రాంతం నుంచి పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా మట్టిలోని మాణిక్యాలను వెలికితీసే విధంగా ఇక్కడ శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ముందుగా క్రికెట్ శిక్షణా ప్రాంగణాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం రాంకీని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కర్రి మహలక్ష్మినాయుడు, రవి, స్వర్ణ జ్యూయలర్స్ బుద్ద శ్రీను, కర్రి నర్సింగరావు, యువకులు పాల్గొన్నారు.

### మొగల్తూరు సబ్ ఇన్స్పెక్టర్‌గా కే.వాసు

# బాధ్యతలు స్వీకరణ



**మొగల్తూరు ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):** మొగల్తూరు సబ్ ఇన్స్పెక్టర్‌గా కే.వాసు ఆదివారం పదవీ బాధ్యతలు స్థానిక పోలీస్ స్టేషన్లో స్వీకరించారు. మొగల్తూరు సబ్ ఇన్స్పెక్టర్గా పనిచేసే ఉన్న కే వెంకటరమణ ఆచంట పోలీస్ స్టేషన్కు బదిలీపై వెళ్లారు. మొగల్తూరు సబ్ ఇన్స్పెక్టర్గా పదవి బాధ్యతలు స్వీకరించిన కే.వాసుకు స్టేషన్ సిబ్బంది ఒక్కొక్కరు కలుసుకుని పరిచయం చేసుకున్నారు.

### అంబేద్కర్ శిలాఫలకంపై జగన్మోహన్ రెడ్డి పేరు తొలగించడం పట్ల

# వైసీపీ నాయకులు నిరసనలు



**అనకాపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రపత్రిక):**రాష్ట్రంలో ఉన్న ప్రజలకే కాకుండా దేశంలో ఉన్న ప్రజలందరికీ దిక్సూచిలా వై.యస్ జగన్మోహన్ రెడ్డి అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగింది.ఆగస్టు 8వ తేదీ రాత్రి సామాజిక న్యాయ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహా శిల్పాన్ని కక్షపూరితంగా కూటమి ప్రభుత్వం కూల్చివేసేందుకు చేసిన కుట్రలో భాగంగానే నామఫలకంలోని అక్షరాలుతొలగింపుకు టిడిపి పచ్చమూకల దాడిని ఖండిస్తూ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆదేశాల మేరకు, పట్టణ పార్టీ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా మలసాల రమణారావు పాల్గొని థియేటర్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 83వ ఇంచార్జ్ జాజుల రమేష్, అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ,రాష్ట్ర మాజీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్, అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్,కలగా గున్నయ్య నాయుడు, సూర్యనారాయణ మూర్తి మాజీ దేవస్థానం చైర్మన్ కే యం నాయుడు,భోగలింగేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు,84వ వార్డు ఇంచార్జ్ కోరుకొండ రాఘవ, దాడి నారాయణరావు,పలకా సత్యనారాయణ, గైపురి రాజు, అనకాపల్లి మండలం వైస్ ఎంపీపీ అయిత రాము,నడిశెట్టి మధు, యువజన విభాగ అధ్యక్షులు ఉగ్గిన అప్పారావు, వేగి త్రినాథ్, నూకంబిక అమ్మవారి మాజీ డైరెక్టర్ బుద్ధ రాజు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరకా సోము నాయుడు,బాధపు హరికృష్ణ,ఎంపీటీసీ కన్నారావు,అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దాడి కుమార్,గుండా గుప్తా, నీటిపల్లి లక్ష్మి,మరిపల్లి శోభ,దొడ్డి హరి, రామకృష్ణ,కొత్తూరు గ్రామ సర్పంచ్ సప్పరపు లక్ష్మీ ప్రసన్న,కోట్నాల పద్మ,కళ్యాణ్, కోన ఉమా, నరేంద్ర, సకల సంతోష్, నాగరాజు, శివ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు గంజాయి సరఫరాదారుల అరెస్టు



- ఏడున్నర కేజీల గంజాయి, రెండు మోటార్ సైకిళ్ళు స్వాధీనం
- కాకినాడ డీఎస్పీ హనుమంతరావు

**కాకినాడ, ఆగస్టు 11(ఆంధ్రప్రత్రిక):**కాకినాడ పరిసర ప్రాంతాల్లో గంజాయి సరఫరా చేస్తున్న ఆరుగురుని ఇంద్రపాలెం పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుండి ఏడున్నర కేజీల గంజాయి, రెండు మోటార్ సైకిళ్ళుల్ను స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ డీఎస్పీ డాక్టర్ కె హనుమంతరావు తెలిపారు. ఆదివారం కాకినాడ ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్లో ఈ కేసుకు సంబంధించి వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జగన్నాధపురం గోలీలపేట చెందిన పాలెపు సతీష్, యానాం గిరిజన పేటకు చెందిన కర్రి శామ్యూల్, కాకినాడ పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన మరువాడ శ్రీనివాస్, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వెనక వీధికి చెందిన బోయి వెంకటరమణ, కాకినాడ డైరీ ఫారం సెంటర్కు చెందిన కలపరెడ్డి శివకుమార్, కాకినాడ సంజయ్ నగర్ ప్రాంతానికి చెందిన వీరిని ప్రభుతేజలు గంజాయి రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో వారు తిష్ట వేసి ఉంటున్న కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామ శివారు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర్లో ఉన్నారన్నారు. వారిపై తమ సిబ్బందితో కలిసి దాడి చేసామన్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపుతున్నట్లు డీఎస్పీ చెప్పారు. యువత గంజాయి బారిన పడకుండా మంచి ప్రవర్తన కలిగి ఉండాలని అలాగే వాటి జోలికి వెళ్ళవద్దని కోరారు. గంజాయి అమ్మిన వాళ్లపై ఉక్కు పాదం మోపుతున్నట్లు చెప్పారు. యువత సత్ప్రవర్తనతో కలిగి ఉండాలని కోరారు. గంజాయితో వ్యాపారం చేసిన లేదా వినియోగించినా వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హనుమంతరావు హెచ్చరించారు. ఈ సమావేశంలో కాకినాడ రూరల్ సీఐ డిఎస్ చైతన్య కృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ వి.మణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ధవళేశ్వరం ఇన్‌స్పెక్టర్‌గా గణేష్





**రాజమహేంద్రవరం, ఆగస్టు 10(ఆంధ్రపత్రిక):**సాధారణ బదిలీల్లో భాగంగా రాజమండ్రి రూరల్ ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గా తిప్పా గణేష్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ గణేష్ మాట్లాడుతూ నేరాల సంఖ్య తగ్గించే చర్యలతోబాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ పై ధవలేశ్వరం వాసులకు అవగాహన కల్పించడానికి చర్యలు చేపడతామన్నారు.

# ఆగస్టు 15 నుండి బీజేపీ ప్రజా ప్రతినిధుల “వారధి”



**రాజమహేంద్రవరం ఆగస్టు 10(ఆంధ్రపత్రిక):**భారతీయ జనతా పార్టీ నుండి ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు , ఎమ్మెల్యేలు మరియు కేంద్ర రాష్ట్ర మంత్రులు వారధి కార్యక్రమంలో భాగంగా విజయవాడలో బీజేపీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం నందు అందుబాటలో ఉంటారని తూర్పుగోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసారు. ఈ సందర్భంగా బొమ్ముల దత్తు మాట్లాడుతూ ప్రజా సమస్యల పై వినతులు స్వీకరించుటకు బీజేపీ ప్రజా ప్రతినిధులు ఒక్కకరూ నెలలో రెండు రోజుల పాటు కార్యకర్తలకు, ప్రజలకు విజయవాడలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, దగ్గుబాటి పురందేశ్వరి పార్లమెంట్ సభ్యురాలు, బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు-ప్రతి నెలలో మొదటి సోమవారం, మూడోవ సోమవారం అందుబాటులో ఉంటారని, నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి శాసన సభ్యులు ప్రతి నెలలో నాలుగోవ సోమవారం, నాలుగోవ మంగళవారం అందుబాటులో ఉంటారని, మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రతి నెలలో మొదటి మంగళవారం,మూడోవ మంగళవారం అందుబాటులో ఉంటారని, సుజనా చౌదరి శాసన సభ్యులు ప్రతి నెలలో మొదటి బుధవారం, రెండొవ బుధవారం అందుబాటులో ఉంటారని, ఈశ్వర రావు శాసన సభ్యులు ప్రతి నెలలో మూడోవ బుధవారం,మూడోవ గురువారం అందుబాటులో ఉంటారని, కామినేని శ్రీనివాసరావు శాసన సభ్యులు-ప్రతి నెలలో మొదటి గురువారం,రెండోవ గురువారం అందుబాటులో ఉంటారని, విష్ణు కుమార్ రాజు శాసన సభ్యులు-ప్రతి నెలలో నాలుగోవ బుధవారం,నాలుగోవ గురువారం అందుబాటులో ఉంటారని, సీఎం రమేష్ ఎంపీ ప్రతి నెలలో మొదటి శుక్రవారం, రెండోవ శుక్రవారం అందుబాటులో ఉంటారని,ఆది నారాయణ రెడ్డి శాసన సభ్యులు- ప్రతి నెలలో మూడోవ శుక్రవారం,మూడోవ శనివారం అందుబాటులో ఉంటారని, పార్థసారధి శాసన సభ్యులు-ప్రతి నెలలో నాలుగోవ శుక్రవారం,నాలుగోవ శనివారం అందుబాటులో ఉంటారని, భూపతి రాజు శ్రీనివాస వర్మ కేంద్ర మంత్రి-ప్రతి నెలలో మొదటి శనివారం, రెండోవ శనివారం అందుబాటులో ఉంటారని, సోము వీర్రాజు జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ-ప్రతి నెలలో రెండోవ సోమవారం, రెండోవ మంగళవారం అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

# మిస్టర్ వరల్డ్ రన్నరఫ్‌గా యశ్వంత్




**విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):**విశాఖ సిటీ సీసీఎస్ ఇన్స్పెక్టర్ పి.శోభన్ బాబు తనయుడు యశ్వంత్ థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన మిస్టర్ టీన్ సూపర్ గ్లోబ్ వరల్డ్ ఫైనల్స్‌లో 1వ రన్నరప్‌గా నిలిచాడు. ‘ఉత్తమ పరివర్తన” అనే ఉప శీర్షికను కూడా పొందాడు. గతంలో కాలికట్‌లో జరిగిన జాతీయ స్థాయి అందాల పోటీలో గెలిచాడు. ఇక్కడ భారతదేశం నలుమూలల నుండి చాలా మంది పోటీదారులు పోటీకి వచ్చారు. యశ్వంత్ ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించాడు. ఈ పోటీలో, మా ఛాంప్ యశ్వంత్ ప్రేమ తన అసాధారణ నైపుణ్యాలతో అద్భుతమైన ప్రదర్శనను అందించాడు. ప్రిన్స్ ఆఫ్ ఎపి, ఇండియా 2024గా 1వ రన్నరప్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో ఆగస్టు 7 నుండి ఆగస్టు 10 వరకు జరిగిన అంతర్జాతీయ స్థాయి అతిపెద్ద అందాల పోటీ “ సూపర్ గ్లోబ్ సీజన్ 3, వరల్డ్ ఫైనల్స్ 2024, ఫైనల్ పోటీకి యశ్వంత్ ఇప్పుడు ఎంపికైనాడు.

### 130వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించిన

# బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ

**అచ్యుతాపురం, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బీఐఏసీ) తన ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 650మంది హాజరు కాగా 400మందికి కంటిచూపు పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఉచిత కంటి వైద్య శిబిరంలో 245కి ఉచిత అద్దాలను అందించి మిగతా 100 మందికి మందులు ఇవ్వడం జరిగింది.




ఈ సందర్భంగా 50మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకో వాల్సిందిగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో వచ్చినవారికి మజ్జిక, పలహారాలు, భోజనం సదుపాయం కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరస్వామి ఈ కార్యక్రమం గురించి మాట్లాడు తూ, “బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం”. బ్రాండిక్స్ ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యం అని అన్నారు.

# నిత్యావసర సరుకులను అందజేసిన పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ కనెక్ట్

**అచ్యుతాపురం, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):**ఆదివారం అచ్యుతాపురం వికలాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను కనెక్ట్ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బ్లేస్సి యశస్విని ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులను ఆటపాటలు నిర్వహించి అనంతరం డాక్టర్ విజయ్ కుమార్(కేజీహెచ్), రత్నకుమారి స్టాఫ్ నర్స్ (కేజీహెచ్), ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రక్తపరీక్షలు నిర్వహించి వారికి మందులు ఉచితంగా ఇవ్వడం అయినది. అనంతరం ఆశ్రమ విద్యార్థులు నిత్యసరుకులు, రైస్ బ్యాగులు, నూనె, కందిపప్పు, మొదలగు వస్తువులను ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకులు జాతీయ అవార్డు గ్రహీత పి.ఎస్.టి పట్నాయక్ చేతుల మీదుగా ఆశ్రమ విద్యార్థులకు అందజేయడమైనది. ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకులు పి.ఎస్.టి పట్నాయక్ మాట్లాడుతూ మన ఆశ్రమం విద్యార్థులకు పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను కనెక్ట్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి వారి యొక్క సమస్యలను గుర్తించి వారికి సరిపడే మందులు ఉచితంగా ఇచ్చినందుకు ఆశ్రమ పాఠశాల తరపునుంచి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను కనెక్ట్ వ్యవస్థాపకులు బ్లేస్సి అశ్విని మాట్లాడుతూ పట్నాయక్ తన పనులు తనే నిర్వహించుకోలేని స్థితిలో ఉన్నప్పటికీ ఎంతో మందికి దిక్సూచిగా ఉంటూ వికలాంగులకు, అనాథ విద్యార్థులకు ఉచిత వసతి మరియు విద్య సదుపా యాలను కల్పిస్తున్నారు. ఈ కార్యక్ర మంలో పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను కనెక్ట్ సలహాదారుడు గోవింద, సంస్థ సభ్యులు



లోకేష్ నాయక్, ప్రీతి, అనిత, ల్యాబ్ టెక్నీషియన్ వంశి మరియు వికలాంగుల ఆశ్రమ పాఠశాల సిబ్బంది మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం అయింది.

ఆంధ్రపత్రిక
జిల్లాలకు విలేఖరులు కావలెను
స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914
విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని నియోజకవర్గాలకు మరియు మండలాల వారిగా విలేఖర్లు కావలెను.
శ్రీకాకుళం జిల్లా అంతటా మరియు విజయనగరంలో ఎస్.కోట, జామి, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, ఎల్.కోట, రాజాం.
ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

### నారా చంద్రబాబునాయుడు కాలనీకి

# కృష్ణానది నీటిని అందిస్తా

## 9వ డివిజన్ కాలనీ వాసులతో ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ, ఆగస్టు 11, (ఆంధ్రపత్రిక) :** నారా చంద్రబాబునాయుడు కాలనీ వాసులకు అతి త్వరలోనే కృష్ణానది నీటిని అందిస్తానని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. అంతే కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని ఈ కాలనీకి తీసుకువస్తానని ఆయన కాలనీ వాసులకు చెప్పారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్ పరిధిలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆదివారం ఉదయం పర్యటించారు. కాలనీలోని రహదారులపై తిరుగుతూ స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం కాలనీ వాసులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ నగరంలో నారా చంద్రబాబు నాయుడు కాలనీ ఉండటం, అందులోనూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ పరిధిలో ఈ కాలనీ ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. విజన్ ఉన్న నాయకుడు కాబట్టి తమ కాలనీకి ఆయన పేరు పెట్టుకోవడం కాలనీ వాసులు గర్వంగా భావిస్తున్నారని చెప్పారు. బలమైన సంకల్పంతో నారా చంద్రబాబు నాయుడు ముందుకు వెళుతున్నాడని చెప్పారు. ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని దాని ద్వారా యువత అభివృద్ధితో



పాటుగా రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన పేరుతో ఉన్న కాలనీలోకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అడుగు పెట్టిస్తానని అన్నారు. కాలనీ వాసులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇవ్వాలని కాలనీ వాసులందరూ కోరుకుంటున్నారని అన్నారు. త్వరలోనే ఆయనను ఈ కాలనీకి తీసుకువస్తానని అన్నారు. కాలనీ వాసులు కృష్ణా నీరు సరఫరా చేయాలని అడుగుతున్నారని, ఈ కాలనీకి అతి సమీపంలో రూ.70 కోట్లతో ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని, అతి త్వరలోనే ఈ కాలనీలోకి కృష్ణానది నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. కాలనీలో కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య ఉందని, వర్షం వచ్చినప్పుడు రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉంటున్నాయని ఆ సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు కె.బలరామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సంస్కారవంతమైన వ్యక్తి అన్నారు. ప్రజా సేవ చేసే గద్దె రామమోహన్ మన నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉండటం మన అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఫ్లైఓవర్ కింద వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయన కుటుంబం టీడీపీకి అంకితమైందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతి శ్రీ, చెన్నుపాటి గాంధీ, యలమంచలి దేవేంద్ర, ముమ్మనేని ప్రసాద్, అన్నబత్తుల బాబి, చిలకలపూడి లక్ష్మీనరసింహారావు, ముక్కామల రామచంద్రరావు, శేషయ్య, కడియాల భవానీ, ప్రసన్న, వల్లూరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



### పోషకాహార బిస్కెట్ 'సూపర్ ఎగ్ అండ్ మిల్క్' బిస్కెట్‌ను విడుదల చేసిన

# ఐటిసి సన్‌ఫీస్ట్




**విజయవాడ, ఆగస్టు 11, (ఆంధ్రపత్రిక) :** పోషకాహారాన్ని అందించడంలో తమ సహకారాన్ని నొక్కి చెబుతూ, పాలు, గుడ్లను పిల్లలకు మరింత ఆకర్షణీయంగా చేయడంలో ఐటిసి సన్ ఫీస్ట్ సూపర్ ఎగ్ మిల్క్ బిస్కెట్ ను విడుదల చేసింది. దీనిలోని సవాళ్ల పై ఐటిసి సన్ ఫిస్ట్ వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తులతో కూడిన పెద్ద చర్చా కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్ ) చైర్మన్ మదన్ మోహన్ మైతీ, ఐడిఏ ఈస్ట్ జోన్ వైస్ చైర్మన్ డాక్టర్ దులాల్ చంద్ర సేన్, క్లినికల్ న్యూట్రిషనిస్ట్ లైఫ్ స్టైల్ కన్సల్టెంట్ డాక్టర్ అనన్య భౌమిక్, సెలబ్రిటీ మామ్ కొనినికా బెనర్జీ, నరిషింగ్ స్కూల్స్ సహ వ్యవస్థాపకులు సీఈఓ అర్చన సిన్హా పాల్గొన్నారు . పిల్లల అభివృద్ధి చెందుతున్న సంవత్సరాల్లో గుడ్డు పాలు రెండూ చాలా కీలకమని ప్యానెల్ లోని సభ్యులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. విటమిన్లు ఎ, డి, ఇ, ఐరన్ మొదలైన అనేక ఇతర పోషకాలతో కూడిన ప్రోటీన్‌కు మూలం అని వెల్లడించారు. పాలు, గుడ్డు వినియోగం పిల్లలకు మరింత ఉత్తేజాన్ని అందించేలా వినూత్న మార్గాలను ప్యానెల్ చర్చించింది. ఈ పరిజ్ఞానం ఆధారంగా మరియు గుడ్డు పాల బిస్కెట్ పరంగా పరిశ్రమ అంతరాన్ని అర్థం చేసుకుంటూ, ఐటిసి సన్‌ఫీస్ట్ ఈరోజు తమ తాజా ఉత్పత్తి ఆవిష్కరణ అయిన సన్‌ఫీస్ట్ సూపర్ ఎగ్ అండ్ మిల్క్ బిస్కెట్‌ను 'గుడ్‌నెస్ ఆఫ్ ప్రోటీన్'తో పరిచయం చేసింది. పిల్లలు పోషకాహారాన్ని పొందేలా ఐటిసి యొక్క ఉత్పత్తి అభివృద్ధి బృందం ఈ బిస్కెట్‌ను జాగ్రత్తగా రూపొందించింది. ఇంకా, "సూపర్ కాంబో, సూపర్ టేస్టీ" అనే ట్యాగ్‌లైన్, తమ వినియోగదారులకు 'గుడ్ ఫర్ యు ' ఉత్పత్తులను అందించడంలో బ్రాండ్ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఐటిసి ఫుడ్స్ యొక్క బిస్కెట్స్ కేక్స్ క్లస్టర్, సీఓఓ, అలీ హారిస్ షేర్ ఈ సందర్భంగా చెప్పారు. సన్‌ఫీస్ట్ ఎగ్ అండ్ మిల్క్ బిస్కెట్లు దక్షిణ తూర్పు భారతదేశం అంతటా రూ.5, రూ. 10, రూ.30. ధరల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# విద్యార్థుల్లో దేశభక్తి భావాలు ప్రోత్సహించాలి

**గుంటూరు : ఆగస్ట్ 11 (ఆంధ్రపత్రిక) ;** విద్యార్థి దశలోనే విద్యార్థులకు మన దేశానికి సంబంధించిన గత, వర్తమాన చరిత్రలను తెలియజేస్తూ వారిలో దేశం పట్ల భక్తి విశ్వాసాలు కలిగేలా తల్లిదండ్రులు, పాఠశాలలు ప్రబోధించాలని ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గన్నే వాసు ఆర్ట్స్, శ్రీ విశ్వకర్మ పీఠం, శంబయాచార్య లలిత కళా పురస్కారంల సంయుక్త ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర దినోత్సవాలు సందర్భంగా ముందస్తుగా స్థానిక అరండల్ పేట శ్రీ దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో విద్యార్థిని, విద్యార్థులకు దేశభక్తి గీతాలు, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, ఏకపాత్రాభినయాల పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా గన్నే వాసు ఆర్ట్స్ వ్యవస్థాపకులు వాసుదేవరావు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, నటన, సాంస్కృతిక అంశాలతో పాటు దేశభక్తి ప్రేరేపిత లఘు చిత్రాలు నిర్మిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యోగి మహేశ్వరానంద స్వామీజీ, వి హనుమంతరావు, కె.వి మల్లికార్జున ఆచారి, మమత, సుకన్య, హరినాథ్ బాబు, సాంబయ్య, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి గీతాలు మొదటి బహుమతి కె కమల్య కాటూరి పబ్లిక్ స్కూల్, రెండవ బహుమతి ఏ నవనీత లోటస్ ఆధ్య పాఠశాల



మూడో బహుమతి బీవీ చరితసాయి కన్నా పాఠశాల, అల్లూరి సీతారామరాజు ఏకపాత్ర మొదటి బహుమతి ఎస్ నీరజ్ శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్, రెండవ బహుమతి ఎస్ సాయి కృష్ణ విజ్ఞం స్కూల్, మూడవ బహుమతి ప్రణీత్ శిశు విద్యా మందిర్, ఝాన్సీ లక్ష్మీబాయి మోనో యాక్షన్ మొదటి బహుమతి ధృతి కన్నా స్కూల్, రెండో బహుమతి హరిణి శిశువిద్య మందిర్, మూడో బహుమతి మోక్ష శ్రీ లోటస్ ఆద్య స్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారు.

### ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే

# కఠిన చర్యలు తీసుకుంటాం

## సీఐ కె.గిరిబాబు హెచ్చరిక



**తిరువూరు ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక) :** విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు తిరువూరు సిఐ కె.గిరిబాబు ఆదివారం సాయంత్రం తిరువూరు పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్ నుండి చీరాల సెంటర్ వరకు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్న షాప్ యజమానులకు ట్రాఫిక్ వెహికిల్ పార్కింగ్ గురించి వివరించారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ 1 ఎస్సై కె.వి జీవి సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

### గుంటూరు ఫోనిక్స్ మాల్‌లో

# గోపూ దాబా

## నూతన ప్రారంభోత్సవం



**గుంటూరు, ఆగస్ట్ 11 (ఆంధ్రపత్రిక) :** గుంటూరులో హోటల్ రంగం నానాటికి విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఫోనిక్స్ మాల్‌లో నూతనంగా గోపూ దాబా ప్రారంభమైంది. పూర్తి శాఖాహారంతో ఏర్పాటు చేసిన గోపూ రెస్టారెంట్ ని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫిలిం ప్రొడ్యూసర్ అండ్ లిరిక్రిస్ట్ ఏ.ఎం రత్నం, టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, కాపు సంఘం నాయకులు దాసరి రాము, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మార్కండేయులు బాబు, హోటల్ నిర్వాహకులు దాసరి శ్రీకాంత్, వెంకటేష్, గంగినేని శ్రావణ్ పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. మెట్రోపాలిటన్ సిటీ తరహాలో గుంటూరు నగరాన్ని అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి వెల్లడించారు. ఇందులో భాగంగా గోపూ లాంటి ప్యూర్ వెజిటేరియన్ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కస్టమర్ యొక్క అభిరుచి ఆలోచనలకు అనుగుణంగా విశాలవంతమైన ప్రాంగణంలో అత్యాధునిక ఇంటీరియర్ డిజైన్లతో ఫ్యామిలీ ఫ్రెండ్స్ తో ఆహ్లాదంగా ఆనందంగా గడిపేందుకు అనువైన వాతావరణంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఏ.ఎం రత్నం మాట్లాడుతూ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చిత్రం హరిహర వీరమల్లు సినిమా నవంబర్ లో విడుదల అవుతుంది అని తెలిపారు.

### "వెలుగుపూలు" కథా సంపుటి

# ఆవిష్కరణ నేడే



**విజయవాడ, ఆగస్ట్ 11 (ఆంధ్రపత్రిక) :** ప్రముఖ రచయిత, రాష్ట్ర సచివాలయ అధికారి శింగమాల సుబ్రహ్మణ్యం రాసిన కథలసంపుటి "వెలుగుపూలు" పుస్తకావిష్కరణ సోమవారం వెలగపూడిలో జరగనుంది. ఆంధ్రప్రదేశ్ సచివాలయ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఏపి సచివాలయం ఐదో బ్లాక్ (రహదారులు, భవనాల శాఖ) లోని రూమ్ నంబర్ 212 లో సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ప్రజాశక్తి బుక్ హౌస్ వర్కింగ్ ఎడిటర్ వొరప్రసాద్, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు, ఎన్.ఆర్.ఐ. ఫౌండేషన్ సిఈఓ గుత్తా హరిసర్వోత్తమ నాయుడు విచ్చేయనున్నారు. అతిథులుగా ఆం.ప్ర. సచివాలయ సాంస్కృతిక సంఘం అధ్యక్షులు డి. స్వర్ణరాజూ, ప్రధానకార్యదర్శి పి. శ్రీక్రిష్ణ, సహాయకార్యదర్శి టి. వెంకటసుబ్బయ్య తదితరులు హాజరవుతారు. సాహిత్యాభిమానులు, కథాప్రియులు సభలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

### అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ విజేతలకు నగదు పురస్కారం



**వి.కోట ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక) :** చిత్తూరు జిల్లా వి.కోటలో రెండు రోజు లుగా నిర్వహిం చిన షూటింగ్ బాల్ పోటీ లలో రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. హెూరాహెూరీగా జరిగిన పోటీలలో చిత్తూరు జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానం గెలుచుకు న్నారు. ఈ సందర్భంగా విజేతలకు స్థానిక నేతలు లయన్స్ క్లబ్ లాంటి స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు నగదు పురస్కారం అందజేసి అభినందించారు. ఈ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు భోజనం వసతి స్థానికపారిశ్రామికవేత్త కోట్ల కిరణ్ కుమార్ రెడ్డి కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ నరేష్, చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేష్, అధ్యక్షులు పవన్ కళ్యాణ్, కార్యదర్శి వేణుగోపాల్ తో పాటు మండల తేదేపా పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, ధీరజ్, ఈశ్వర్, నాగభూషణం, సోము తదితరులు పాల్గొన్నారు.

### దేహం నిండా దేశభక్తి కలిగిన

# గొప్ప నాయకుడు పవన్ కల్యాణ్

## పవన్ కల్యాణ్ లాంటి మహెూన్నతమైన నాయకుడి బాటలో నడుస్తున్నందుకు గర్వపడుతున్నాం

## గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి



**గుంటూరు,ఆగస్ట్ 11 (ఆంధ్రపత్రిక)** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు గతంలో ఎన్నడూ లేనివిధంగా 5 వేల లోపు ప్రజలున్న గ్రామాలకు పదివేల రూపాయలు, అంతకంటే ఎక్కువమంది జనాభా ఉన్న గ్రామాలకు 25 వేల రూపాయల నిధులను సర్పంచ్ లకు కేటాయించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రాష్ట్ర నలుమూలల నుంచి ప్రశంసల జల్లులు కురుస్తున్నాయని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం ఆళ్ళ హరి మీడియాతో మాట్లాడారు. దేహం నిండా దేశభక్తి మెండుగా ఉన్న పవన్ కల్యాణ్ నిర్ణయంతో ప్రతీ గ్రామానా, ప్రతీ స్కూల్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా స్ఫూర్తివంతంగా జరగనున్నాయన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా అరకొర నిధులతో తూతూ మంత్రంగా జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఈసారి దేశభక్తి మరింత పెంపొందేలా జనసేనాని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. మరోవైపు స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పోరాడిన త్యాగధనుల గురించి , వారు పడ్డ కష్టాల గురించి ఆగస్ట్ 15 విశిష్టత తెలిసేలా విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందేలా వ్యాసరచన, క్విజ్ పోటీలు, డిబేట్ లు నిర్వహించేలా చర్యలు తీసుకోవటం ఎంతో ముదావహమన్నారు. అలాగే జనసేన పార్టీ ప్రధాన సిద్ధాంతమైన పర్యావరణ పరిరక్షణకై అవకాశం ఉన్న ప్రతీ సందర్భంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పవన్ కల్యాణ్ ప్రయత్నం చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్లాస్టిక్ జెండాలకు, తోరణాలకు బదులుగా నూలు వస్త్రాలతో, గుడ్డతో చేసిన పతాకాలను మాత్రమే వాడాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారన్నారు. ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణకు తమవంతుగా కృషి చేయాలని ఆయన కోరారు. పవన్ కల్యాణ్ స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ గ్రామంలో త్రివర్ణపతాకం రెపరెపలాడనుందని, పవన్ కల్యాణ్ లాంటి మహెూన్నతమైన నాయకుడి బాటలో నడుస్తున్నందుకు జనసైనికులకు, వీరమహిళలకు ప్రతీక్షణం గర్వంగా ఉంటుందని ఆళ్ళ హరి అన్నారు.

## భూపతిపాలెం గురుకుల పాఠశాల నూతన కమిటీని

# అభినందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గోకవరం జగ్గంపేట, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** తెలుగుదేశం పార్టీకార్యాలయంలో నూతనంగా ఎన్నికైన భూపతిపాలెం గురుకుల పాఠశాల చైర్మన్ గల్లా రామచంద్రరావు ( రాము) వైస్ చైర్మన్ అందే శివ వెంకట దుర్గ రాజీవ్, కమిటీ సభ్యులను జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారిని ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా నూతన కమిటీ ఎమ్మెల్యేతో మాట్లాడుతూ, గురుకుల పాఠశాలలో డార్మెంటరీ, భోజనశాల, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని, కళాశాల ఆవరణలో గల లైట్లు వెలగడం లేదని కనీస అవసరాలు అయినా విద్యుత్తు సరఫరా సరిగా ఉండటం లేదని, బోధన, బోధనేతర సిబ్బంది తక్కువగా ఉండవల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, ముఖ్యంగా రహదారి సౌకర్యం కూడా అధ్వానంగా ఉందని విద్యార్థులు అనారోగ్యానికి గురి అవుతాయి ఆసుపత్రికి



వెళ్లేందుకు ఒక వాహనాన్ని కూడా ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఎమ్మెల్యే నెహ్రూ తొందర్లోనే సమస్యలని పరిష్కరిస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు డీ.లోవ ప్రసాద్, ఎన్ వెంకన్నబాబు, సిహెచ్ నాగరాజు, పి.వీరబాబు, టీ.ఆనంద్, ఐ.రాజు, టి.అప్పలరాజు, కే.గంగ వేణి, బి.బాబి, దాసరి దేవి తదితరులు పాల్గొన్నారు.



## పేరెంట్స్ కమిటీ అధ్యక్షులను

# అభినందించిన ఎమ్మెల్యే

**పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి: బత్తుల బలరామకృష్ణ**

**కోరుకొండ, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** పాఠశాలల అభివృద్ధికి విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తూ అంకితభావంతో పనిచేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు రెడ్డి అశోక్ కుమార్, వీరభద్రపురం మండల పరిషత్ పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు ఏడాకుల శివరామకృష్ణ, బీసీ కాలనీ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ దూది శ్రీను లను ఎమ్మెల్యే బలరామకృష్ణ అభినందించారు. గాదరాడ గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించిన సందర్భంగా చైర్మన్లు ఇరువురిని ఎమ్మెల్యే అభినందించి, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూది కాంతారావు, టిడిపి సీనియర్ నాయకులు వల్లేపల్లి గోపి, దేవన బాబురావు, దుర్గాప్రసాద్, ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ కందికట్ల మరిడియ్య, గళ్ళ సతీష్, పిన్నమరెడ్డి విజయ్, గండి రమేష్, గరగ త్రిమూర్తులు, గ్రామ ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 200 లీటర్ల సారా స్వాధీనం

**3,500 లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం**
**ముగ్గురు నిందితులు పరారు, కేసు నమోదు**
**కోరుకొండ ఎస్సై ఆనంద్ కుమార్**



**కోరుకొండ, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** తూర్పు గోదావరి జిల్లా ఎస్పి నరసింహకిషోర్ ఆదేశాలు మేరకు ఉత్తర మండల కె డిఎస్పి శ్రీనివాసులు, కోరుకొండ సిఐ అడపా నాగమురళి పర్యవేక్షణలో కోరుకొండ ఎస్సై డి ఆనంద్ కుమార్ సారా వ్యాపారులపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, కోరుకొండ మండలం గరగలంపాలెం గ్రామ శివారులో సారా బట్టి నిర్వహిస్తున్న ప్రాంతాన్ని తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించి, 200 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా 3,500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసామని వివరించారు. ఈకేసుకు సంబంధించి రెండు మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలియజేశారు. సీతానగరం మండలం అచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన నిందితులు ముగ్గురు ఈకేసులో పరారయ్యారని వారిపై కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచటం జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈతనిఖీల్లో కోరుకొండ, సీతానగరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

## గైస్ కళాశాలలో

# సేఫ్టీపై ప్రత్యేక సెమినార్



**విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. రమణ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ అండ్ కెమికల్ సేఫ్టీ పై సెమినార్ నిర్వహించారు. అమర్ రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్, తిరుపతి సేఫ్టీ డిపార్ట్మెంట్ హెడ్ ఆర్.ఎస్.ఎస్.ఆర్.సురేష్ చే "టెక్నిక్స్, ఐడెంటి ఫికేషన్ ఆఫ్ హజార్డ్స్ అండ్ రిస్క్ మేనే జ్మెంట్ ఇన్ సేఫ్టీ" అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ విద్యార్థులు పరిశ్రమలలో ప్రమాదాలను విపత్తులను ఎలా నివా రించాలి. రిస్క్‌ని ఎలా మేనేజ్ చేయాలి, అనే అంశంపై ఆయా బ్రాంచ్ లకు చెందిన విద్యార్థులు అవగాహన పెంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ విద్యార్థులతో పాటు, సేఫ్టీ కోర్స్ కో-ఆర్డినేటర్ ఏ.వరహాలు, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సీనియర్ మేనేజర్ ఇన్ సేఫ్టీ మాధవ్ కుమార్ పాల్గొని కార్యక్రమంను విజయవంతం చేశారు.

## బండి ముత్యాలమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు

**మొగల్తూరు, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో శ్రీ శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయమునకు ఆదివారం భక్తులు తరలివచ్చి క్యూలో నిలబడి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు.



## వర్గీకరణ పోరాటంలో

# ఇంకెన్ని ప్రాణాలు తీస్తారు

**- మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబార్కి కిరణ్ ఆగ్రహం**



**వేపాడ, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** అన్నదమ్ముల్లా ఉండే ఎస్సీలను వర్గీకరిస్తూ వర్గీకరణ (పేరుతో) పోరాటంలో ఇంకెన్ని ప్రాణాలను బలి తీసుకుంటావని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మాల మహానాడు మండల అధ్యక్షుడు దేబార్కి కిరణ్ ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ సందర్భగా మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబార్కి కిరణ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు,ఎమ్మార్పీఎస్అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగలు కుమ్మక్కై ఎస్సీ వర్గీకరణకు పాల్పడితే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇదే మాదిరిగా1997ఆగస్టు 11న మాల మహానాడు వ్యవస్థాపకులు పి.వి రావు సారధ్యంలో 10లక్షల మంది మాలలు అసెంబ్లీ,సచివాలయాలను ముట్టడి చేయగా,చంద్రబాబు మాలలను గుర్రాలతో తొక్కించి కాల్పులు జరిపించి ఆనాడు మారణకాండ సృష్టించారన్నారు. ఈ పోరాటంలో పోనంగి శేషయ్య, జి.నారాయణలు అసువులు బాసగా అనేకమంది గాయాలపాలై ఆసుపత్రి పాలయ్యారన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన మాల మహానాడు నేతలు,పోనంగి శేషయ్య, జి.నారాయణల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల మాల మహానాడు నేతలు విసన్న వదనంతో మండల కేంద్రంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల మాల మహానాడు నేతలు కోరుపోలు గంగరాజు, దేబార్కి రవి, కడారి అప్పారావు, చెలికాని బంగారయ్య, పుదర చైతన్య,గాడి అప్పారావు,పి. స్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల బలోపేతం

# చేతల్లో చూపించాలి

**- పి.ఆర్.టి.యు**

**కె.కోటపాడు, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** ప్రభుత్వ పాఠశాలలను బలవపేతం చేయడం మాటల్లో చెప్పినట్టే చేతల్లో కూడా చూపించాలని, దీనికోసం ఉపాధ్యాయ సంఘాల నాయకుల సూచనలు, అభిప్రాయాలను తీసుకోవాలని ప్రోగ్రెస్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పి.ఆర్.టి.యు) మండల శాఖ అధ్యక్షుడు పోతల నాయుడుబాబు, ప్రధాన కార్యదర్శి ఇమంది ప్రవీణ్ కోరారు. సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్(సాల్ట్) ప్రాజెక్ట్ అమలుకు సంబంధించి అధికారులతో మంత్రి లోకేష్ మాట్లాడిన సమయంలో ప్రైవేట్ స్కూల్స్ కు ధీటుగా పాఠశాలలను బలోపేతం చేయడానికి అధికారులను ఆదేశించడం హర్షణీయం అన్నారు. జీవో నెంబర్-117 రద్దుద్వారా మాత్రమే ప్రభుత్వ పాఠాశాలలు బలోపేతం అవుతాయని, యువగళం పాదయాత్రప్పుడు లోకేష్ ఇచ్చిన హామీని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని వారుకోరారు. ప్రభుత్వ పాఠాశాలలు బలోపేతం కావడం ఒక్క ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అభిప్రాయపడ్డారు. అందుకోసం టీచర్, స్టూడెంట్ నిష్పత్తిని తగ్గించాలని, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తప్పించాలని పి.ఆర్.టి.యు.మండల శాఖ అధ్యక్షుడు నాయుడుబాబు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కోరారు.

## బాల వికాస్ కేంద్రాల్లో ఆధ్యాత్మిక బోధన



**కె.కోటపాడు, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):** శ్రీ సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల వికాస్ కేంద్రాలు సత్ఫలితాలనిస్తున్నాయని శ్రీ సత్యసాయి భజన మండళ్ళ కె.కోటపాడు సమితి కన్వీనరు బండారు నారాయణ పాత్రుడు అన్నారు. అనకాపల్లి జిల్లా శ్రీ సత్య సాయి సేవా సంస్థల ఆదేశాల మేరకు మండలంలో పలు గ్రామాల్లో శ్రీ సత్య సాయి భజన మండళ్ళ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం మందిరాల్లో నడుపుతున్న బాల వికాస్ కేంద్రాలకు మంచి స్పందన లభిస్తుందన్నారు. ఆయా కేంద్రాల్లో బాలలకు విద్యతోపాటు ఆధ్యాత్మికతతో కూడిన ఎన్నో పాఠాలను బోధిస్తున్నారని చెప్పారు. దీంతో పిల్లలు క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం బాలవికాస్ కేంద్రాలకు వస్తున్నారని నారాయణ పాత్రుడు అన్నారు.

# సొంతగూటికి చేరిన జాకేరు సర్పంచ్ బుద్ద వర్గీయులు

**టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే కోళ్ల దంపతులు**



**వేపాడ, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** మండలంలోని జాకేరు గ్రామ సర్పంచ్ బుద్ద చిన్నమ్మలు అప్పల నాయుడు దంపతులతో పాటు సుమారు రెండు వందల మంది బుద్ద వర్గీయులు ఆదివారం ఉదయం ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎల్.కోటలోని ఎమ్మెల్యే స్వగృహంలో జాకేరు గ్రామానికి చెందిన కలవలపల్లి సూరి బాబు,సలాది నరేంద్రల సారథ్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో ఉప సర్పంచ్ వారాది అప్పల నాయుడు,పంచాయతీ వార్డు మెంబర్లు సుంకరి రామ సత్యం,సలాది సత్యవతి,కలవలపల్లి శ్రీనివాసరావు,జుట్టుకు నాగేష్, కోలా రమణమ్మ, మిరియాల ముత్యాలమ్మ, బుద్ద హైమావతి,ఎస్ ఎంసీ చైర్మన్ వంగలి వాసుదేవరావు, మిల్క్ సొసైటీ అధ్యక్షులు కర్రి నరసింహమూర్తి, పాల పీఏస్ కోలా వీరన్నదొర,మండల వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోలా వీరన్న తదితరులతో పాటు సుమారు రెండు వందల మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరగా వీరందరికీ ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇంకా మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణ మూర్తి, నల్లబిల్లి మాజీ సర్పంచ్ బోజంకి మహేష్,జాకేరు జనసేన,బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ పార్టీకి బిగ్ షాక్

**ఎంపీపీ, వైస్.ఎంపీపీతో సహా పలువురు జనసేన గూటికి...**



**మునగపాక, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఊహించనిరీతిలో ఘోర పరాజయం చవిచూసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అడుగడుగునా విఘాతాలు ఎదురవుతున్నాయి. మునగపాక మండలంలో ఉన్న 16 ఎంపీటీసీ స్థానాల్లో విజయం సాధించి స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పాగా వేసిన వైకాపా కోటకు బీటలు పడుతున్నాయి. అ పార్టీకి షాక్‌లు మీద షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. దానికి అనుగుణంగానే వైకాపాకు చెందిన మునగపాక ఎంపీపీ మళ్ల జయమ్మ ఆదివారం ఆ పార్టీని వీడి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. అదేతోవలో వైస్.ఎంపీపీ బోజా వెంకటలక్ష్మి శ్రీనువాసరావు కూడా వైకాపాను వీడి ఎమ్మెల్యే విజయకుమార్ సమక్షంలో జనసేనలో చేరారు. అదే విధంగా రాజుపేట సర్పంచ్ కిలాడి దేముడు కూడా జనసేన గూటికి చేరారు. ఎన్నికలకు ముందు నాగవరం ఎంపీటీసీ పాలిపిని శ్రీనువాసరావు జనసేన పార్టీలో చేరిన విషయం అందరికి తెలిసిందే. ఇటీవలే నాగులాపల్లి ఎంపీటీసీ, మండల పరిషత్ వైస్.ఎంపీపీ అయిన చిందాడ దేవి కూడా జనసేన పార్టీలో చేరారు. ఈ నెల 12వ తేదీ సోమవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఉన్న నేపథ్యంలో ముందు రోజు అయిన ఆదివారం ఎంపీపీ, వైస్.ఎంపీపీలు జనసేన పార్టీలో చేరడం సంచలనంగా మారింది. మండలంలో 16 మంది ఎంపీటీసీల్లో ఒకరు చనిపోగా మిగిలిన 15లో నలుగురు ఎంపీటీసీలు జనసేన పార్టీలో చేరడంతో ప్రస్తుతం వైకాపా ఎంపీటీసీలు సంఖ్య 11 పడిపోయింది. కాగా జనసేన పార్టీలో చేరేందుకు విచ్చేసిన ఎంపీపీ, వైస్.ఎంపీపీ, సర్పంచ్‌లను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సాదరంగా ఆహ్వానించి,జనసేన కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. వ్యక్తులు ప్రయోజనం కంటే వ్యవస్థలు పటిష్టం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆ ఆలోచనలుతోనే కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు మండల శాఖ అధ్యక్షులు దొడ్డి శ్రీనువాసరావు, టెక్కలి పరశరాం, ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రాయితీపై టేకు దుంపలు పంపిణీ

**జియో వ్యవస్థాపకుడు రామకృష్ణ**




**వేపాడ, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వెయ్యి టేకు దుంపలను ఆదివారం మండలంలో పంపిణీ చేసినట్లు జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక బార్ అసోసియేషన్ కోశాధికారి బి.త్రిమూర్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జి యో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ సామాజిక అడవులు పెంచాలనే వారికి జియో సంస్థ ద్వారా రాయితీపై టేకు దుంపలను పంపిణీ చేస్తున్నామన్నారు. కావలసినవారు 9391138665 నెంబ రుకు ఫోన్ చేయవచ్చున్నారు. వేపాడ, యస్.కోట, కొత్తవలస మండలాల రైతులు లబ్దిపొందారన్నారు. ఈ కార్యక్రమంలో కొట్యాడ ఈశ్వరరావు, బి.హృషీకేశ్, లాస్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## శృంగవరపుకోట రూరల్ సీఐగా రవి కుమార్

# బాధ్యతలు స్వీకరణ



**వేపాడ, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** శృంగవరపుకోట రూరల్ పోలీస్ స్టేషన్ సీఐగా కె.రవికుమార్ ఆదివారం ఉదయం భాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా బాధ్యతలు నిర్వహించిన హనుమంతు ఉపేంద్ర రాజాం పోలీసు స్టేషన్‌కి బదిలీ కాగా, మన్యం జిల్లా పార్వతీపురం రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తూ ఎస్.కోట రూరల్ సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్బంగా స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ స్టేషను పరిధిలో పెండింగ్ కేసులపై దృష్టి సారిస్తానన్నారు. అలాగే మండలంలోని ఏ గ్రామంలోనైనా మద్యం బెల్టు షాపులను నిర్వహించినా, నాటు సారా తయారు,అమ్మకాలు జరిపినా, మైనర్లు వాహనాలు నడిపినా, కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జరిపిన, అమ్మాయిలను వేధించే ఆకతాయిల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ రవికుమార్ హెచ్చరించారు.

# క్యాన్సర్ చికిత్సలో శస్త్ర చికిత్స ఎంతో కీలకం

**క్యాన్సర్ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ కార్తీక్ చంద్ర**

**విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** క్యాన్సర్ చికిత్సలో శాస్త్ర చికిత్స ఎంతో కీలకమని, మెడికవర్ ఆసుపత్రి క్యాన్సర్ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ కార్తీక్ చంద్ర అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, వైజాగ్ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ తో కలిసి మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, ఏపీకి చెందిన సర్జికల్ ఆంకాలజిస్ట్‌లతో ఒక ప్రైవేట్ హోటల్ లో సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్‌వీఎస్ దేవ్, డాక్టర్ పీజే శ్రీనివాస్, మెడికవర్ ఆసుపత్రి ఎపి రీజినల్ డైరెక్టర్ శ్రీమతి నిమ్మగడ్డ పద్మజ, క్యాన్సర్ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ కార్తీక్ చంద్ర సర్జికల్ ఆంకాలజిస్ట్ మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ల మార్గదర్శకత్వంలో విజ్ఞానం నైపుణ్యాలను పెంపొందించడానికి యువ ఔత్సాహిక సర్జికల్ ఆంకాలజిస్టులకు ఈ రకమైన సమావేశం ముఖ్యమైన దని డాక్టర్ ఎస్‌వీఎస్ దేవ్ అన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కార్తీక్ చంద్ర మాట్లాడుతూ, క్యాన్సర్ చికిత్సలో శస్త్ర చికిత్స ఎంతో కీలకమని, సర్జికల్ ఆంకాలజిస్టులు ఈ రంగంలో సరికొత్త పురోగతులను అందిపుచ్చుకోవాలని,




అందుకే క్యాన్సర్ రోగులకు చికిత్స చేయడంలో అత్యుత్తమ శస్త్ర చికిత్స ఆచరణలు ప్రదర్శిస్తూ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ జాతీయ స్థాయి వక్తలు ముఖ్యమైన అంశాల పై ప్యానెల్ చర్చలతో పాటు కీలక-నోట్ ఉపన్యాసాలు, ప్రదర్శనలు ఇచ్చారు. దాదాపు 200 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. ఇతర ప్రముఖులు డాక్టర్ ఎంవీఎస్ ఎస్ బాపారావు, డాక్టర్ కె.శిల్ప, అబ్జర్వర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ లాలిత్య స్వర్ణ, 20 మంది సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులతో కలిసి హాజరయ్యారు.

## గురుకుల పాఠశాలలో మిగుల

# సీట్ల భర్తీకు దరఖాస్తులు ఆహ్వానం

**దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి గడువు**
**ఈనెల 20. పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి.**



**వేపాడ, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** మండల కేంద్రం వేపాడ పంచాయతీ శివారు బక్కు నాయుడుపేట గ్రామంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగుల సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి ఆదివారం తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను పాఠశాలలో 5 నుండి ఇంటర్మీడియట్ వరకు మిగుల సీట్ల భర్తీకి ఈనెల 20వ తేదీ వరకు గడువు ఉందన్నారు. రిజర్వేషన్ ప్రకారం సీట్ల వివరాలు,5వ తరగతికి సంబంధించి ఎస్సీ కేటగిరి 35సీట్లు,6వ తరగతికి సంబంధించి ఎస్సీ 8 సీట్లు,7వ తరగతికి సంబంధించి ఎస్సీ 13సీట్లు,8వ తరగతికి సంబం ధించి ఎస్సీ 14సీట్లు, అలాగే తొమ్మిదవ తరగతికి సంబంధించి ఎస్సీ కేటగిరికి 13 సీట్లు,అదేవిధంగా ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపుకు సంబంధించి 4సీట్లు మిగిలి ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే సప్లమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిలు కూడా అర్హులేనని తెలిపారు. అర్హులైన విద్యార్థినిలు తమ యొక్క టీ.సీ.,స్టడీ,విద్యార్థిని,విద్యార్థిని తల్లిదండ్రుల,ఆధార్ జిరాక్స్ లు,కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు,విద్యార్థినికి సంబంధించి 5 పాస్పోర్ట్ సైజ్ ఫోటోస్,కుటుంబం యొక్క గ్రూప్ ఫోటోతో నేరుగా వచ్చి పాఠశాలలో చేరవచ్చునన్నారు. కావున ఎస్సీ కేటగిరికి సంబంధించిన విద్యార్థునిలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొని ప్రభుత్వం తమకు కల్పించిన అవకాశాన్ని వినియో గించుకుంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు.

# హైందవ ధర్మాన్ని కాపాడటమే నా లక్ష్యం

**విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాస రావు - గోకవరంలో బంగారు వరలక్ష్మి కానుక -2 లక్కీడ్రాకి విశేషస్పందన**




**గోకవరం, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక) :** గోకవరం సూర్య ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక-2 లక్కీ డ్రా కార్యక్రమానికి విశేషా స్పందన లభించింది. స్త్రీమూర్తులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేసారు. తొలిత విశ్వ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావుకు పూర్ణకుంభంతో మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం లక్కీ డ్రా కార్యక్రమాన్ని కంబాల శ్రీనివాసరావు ప్రారంభించారు. స్థానిక దేవిచౌక్ అమ్మవారి ఆలయంలో అయిదు రోజులు పాటు నిర్వహించిన రిజిస్ట్రేషన్ లో సుమారు 4,000 మంది పేర్లు నమోదు చేసుకోగా లక్కీ డ్రా లో 92 మంది విజేతలుగా నిలిచారు. వీరందరికి 7,500 రూపాయల విలువ చేసే ఒక గ్రాము బంగారు వరలక్ష్మి రూపును కంబాల శ్రీనివాసరావు ఉచితంగా అందజేశారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ, మహిళా భక్తుల్లో హైందవ చైతన్యాన్ని తీసుకురావాలని సంకల్పంతో ఈ బంగారు వరలక్ష్మి కార్యక్రమన్ని రూపకల్పన చేయడం జరిగింది అన్నారు. సనాతన, హైందవ ధర్మాన్ని రక్షించడానికి నిరంతర కృషి చేస్తునే ఉంటానని అన్నారు. చాల మంది రాముడు, యేసు, అల్లా వేర్వేరు దేవుళ్ళ అనుకుంటున్నారని, ఈఆలోచన తప్పన్నారు. పంచభూతాలుగా పరబ్రహ్మ స్వరూపం ఒకరే ఉంటారని, ఆయనకు రూపం ఉండదన్నారు. చదువుకున్న సైంటిస్టులు కూడా దేవుడిని వేర్వేరు చేసి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతం అనేది మన జీవన విధానమని, మతానికి దేవుడికి అసలు సంబంధమే లేదన్నారు. మన హిందూ ధర్మాన్ని కాపాడడం కోసం మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా, యోగి ఆదిత్య నందు వంటి వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాబోయే కాలంలో హైందవ ధర్మాన్ని కాపాడడానికి కోసం విస్తృతమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే గోకవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఐఏఎస్, ఐపీఎస్, క్రీడాకారులు, మంచి సంగీత, నృత్య, కళాకారులు, డాన్సర్లును తీసుకు రావడానికి కృషి చేస్తానన్నారు. ఇందు కోసం భవిష్యత్తులో తంటికొండ రోడ్డు లోని నా లేవుట్ వద్ద పలు నూతన భవన నిర్మాణాలు నిర్మించి, చిన్న పిల్లలు నుంచి వయోవృద్ధుల వరకు ఏ ఏ కార్యక్రమాలు చేస్తే వారికి లబ్ది కలుగుతుందో అంటువంటి ప్రోగ్రామ్స్ చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. దీనికి ప్రజలందరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరు ఎదుటవారికి సహాయం చేసే గుణాన్ని అలవాటు చేసుకోవాలని, ఒకరికి ఇవ్వడం లోని ఆనందం ఎంతో గొప్పగా ఉండుదన్నారు. ఎదుటి వారు ఎవరైనా మన్నల్ని నిందిస్తే మౌనంగా ఉండటం, వంటి లక్షణాలు నేర్చుకోవాలని అన్నారు. అమ్మవారి దివ్య ఆశీస్స లతో ముందు, ముందు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. గోకవరం పరిసరాలు ప్రాంతాలకు చెందిన పలువురు పండితులకు శ్రీనివాసరావు చేతుల మీదుగా వరలక్ష్మి రూపులను అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్ద దాసరి తమ్మన్నదొర, విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ, కట్టా నూకేశ్వర విజయ్ కళ్యాణ్, ఆచంట రాజు, మంగరౌతు దుర్గా శ్రీనివాస రావు, మంగరౌతు పద్దరాజు, సత్తి వెంకటరెడ్డి, ఉంగరాల ఆది విష్ణు, కొత్తపల్లి సత్యనారాయణ,దేవి చౌక్ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు ఆర్థిక సహాయం చేయండి : సిపిఎం




**ఎమ్మిగనూరు, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):** కేరళ వాయినాడు వరద బాధితులకు ఆర్థిక సహాయం చేయండి బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ విరాళాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వరద బాధితులకు మన వంతుగా సహాయంగా విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కేరళ రాష్ట్రం వాయనాడు జిల్లాలో కొండ చర్యలు విరిగిపడి వందలాదిమంది చనిపోయినారని అనేకమంది క్షత గాత్రులయ్యారని అనేకమంది గల్లంతయ్యారని అన్నారు. అందుకు స్పందించిన ఎమ్మిగనూరు సిపిఎం నాయకులు ప్రజలను అడిగిన తక్షణమే పది రూపాయలు మొదలుకొని ఇచ్చారని ప్రజలందరూ ఎంతో సానుకూలంగా స్పందించారని దీనికిగాను కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కేంద్రంలో ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వం దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించి వాయునాడు ప్రజలను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు గోవిందు రాముడు రైతు సంఘం నాయకులు అబ్దుల్లా లక్ష్మీ నరసయ్య రమేష్ రామన్న డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ సాధ్వి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షు కార్యదర్శి రంగప్ప అబ్దుల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్ రాము పాల్గొన్నారు.

## కళ్యాణ మండపం నిర్మాణం కొరకు విరివిగా విరాళాలు



**సోమల,ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):** సోమల మండలం సోమల గ్రామంలో వెలసిన అతిపురాతన ఆలయం శ్రీ స్వయం బెశ్వర్ స్వామి ఆలయం ఆవరణలో బడుగు బలహీన వర్గాలకు కోసం నిర్మిస్తున్న కళ్యాణ మండపం దాతలు విరాళాలు చే నిర్మిస్తున్న సంగతి గ్రామస్తులు కు తెలిసిందే.ఈ క్రమంలో నే భక్తులు మండపం నిర్మాణం కొరకు తమ యొక్క విరాలముల ను ఆదివారం సోమల కు చెందిన దివంగత పచ్చి పులుసు విశ్వనాథం జ్ఞాపకార్థం కుమారుడు మంజునాథ్ రు.10 116/లువన్నురప్ప గారి చిన్నక్క రు.3000/లు మరియు కామిశెట్టి అశోక్ రు.5000/లను ఆలయ ధర్మకర్త బి.వి.సోమసేకర్ ,లింగయ్య సి.రామయ్య కు అందజేశారు.

## ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ విరమించుకోవాలి

### మాల మహానాడు



**చౌడేపల్లి,ఆగస్టు11(ఆంధ్రపత్రిక):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏసీ వర్గీకరణను విరమించుకోవాలని, మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం, డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుంచి, ర్యాలీగా శ్రీ లక్ష్మి శ్రీనివాస కళ్యాణమండపం వరకు వెళ్లి, అక్కడ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాల మహానాడు నాయకులతో ఎస్సీ వర్గీకరణ రద్దు పై చర్చ నిర్వహించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ప్రభావిత ఎస్సీ వర్గీకరణ తీర్పును విరమి ంచుకోవాలన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, రచించిన భారత రాజ్యాంగాన్ని అనుసరించి ఎస్సీలకు రిజర్వేషన్లు యధాత ధంగా ఉంచాలన్నారు. వర్గీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం రిజర్వే షన్లను, ఎత్తివేసే కుట్ర పూరిత నిర్ణయాలు తీసుకుంటుందని, అందరం సమైక్యంగా పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో పర్యటిస్తూ ధర్మ యుద్ధం చేస్తామని ఆయన అన్నారు. ప్రభుత్వాలు ఇకనైనా ఎస్సీ వర్గీకరణను రద్దు పరచకపోతే పోరాటాలు ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణను నాయకు లతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర జిల్లా మండల స్థాయి నాయకులు, అశోక్ ,గుండా మనో హర్, యమల చంద్రయ్య, వీరభద్ర, కలికిరి హరి, జిల్లా ఉపాధ్య క్షుడు శివకుమార్, నియోజకవర్గ బీఎస్పీ ఇన్చార్జి వసంతపల్లి సురేష్, వెంకటస్వామి, నరేష్, సుబ్రహ్మణ్యం, లక్ష్మీపతి, రామయ్య, శ్రీనివాసులు, శేఖర్ బాబు, ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# మురార్జీ యాదవ్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్




**యాదమరి, ఆగస్టు 11:(ఆంధ్రపత్రిక):** పూతలపట్టు నియోజక వర్గం, యాదమరి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కే.ఎస్.మురార్జీ యాదవ్ పుట్టిన రోజు వేడుకల్లో లిపూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ శ్రీ కలికిరి మురళీమోహన్ గారులి పాల్గొన్నారు. ఆదివారం యాదమరి మండల కేంద్రంలో జరిగిన కే.ఎస్.మురార్జీ యాదవ్ పుట్టిన రోజు వేడుకలకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ గారు హాజరై పూతలపట్టు నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేయించి తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మరియు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.జిల్లా కార్యదర్శి హేమ గిరి,వల్లేరు అమర్నాథ్ నాయుడు,మండల అధ్యక్ష కార్యదర్శులు మొరార్జీ యాదవ్, వెంకటేష్ రబీ, ఐరాల మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్, తవణంపల్లి పార్టీ మండల అధ్యక్షుడు దిలీప్ కుమార్, గంగారపు గోపి, విజయేంద్ర యాదవ్, నిత్యానంద, యాదమరి మండల జనసేన అధ్యక్షుడు కుమార్, వేణు గోపాల్ నాయుడు,వెంకటేష్, మోహన్ నాయుడు, మండల నాయకులు చిత్రా నాయుడు, గుణశేఖర్, గోపి గౌడ్,ధరణి ప్రకాష్, సర్పంచులు మహాలక్ష్మి, హేమయ్యానాయుడు, నాగరాజు, రవి మొదలి ,నాయకులు హరి సతీష్ నాయుడు,వెంకటేష్ నాయుడు, లక్ష్మి పతి నాయుడు,పిడి వెంకటేష్ , పట్టాభి, మునిరత్నం సుబ్రహ్మణ్యం మహబూబ్ బాషా,మునీర్ మురుగేష్ యాదవ్,మనోహర్ యాదవ్,, మోహన్, దాము వేణు యాదవ్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## నూతనంగా బిషప్ అధ్యక్షులుగా గోరంట్ల జ్వాన్నేస్

**- బిషప్‌ను రథంపై ఊరేగింపు**




**ఎమ్మిగనూరు, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):** ఇటలీ దేశానికి చెందిన గోరంట్ల జ్వాన్నేస్ కర్నూలు జిల్లా ప్రాంతానికి బిషప్ అధ్యక్షులుగా వచ్చారని విచారణ గురువులు రెవ. ఫాదర్ బి. చెన్నప్ప పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పురవీదుల గుండా ఊరేగింపుగా బిషప్ అధ్యక్షు లుగా గోరంట్ల జ్వాన్నేస్ లను విచారణ గురువులు రెవ:ఫాదర్ బి. చిన్నప్ప. సంఘ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆర్సిఎం చర్చి నందుబిషప్ అధ్యక్షులు గోరంట్ల జ్వాన్నేస్ ను విచార ణ గురువులు రెవ. ఫాదర్ చిన్నప్ప. సంఘ పెద్దలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు. సంఘస్తులు పాల్గొన్నారు

## బీచ్‌లో జిల్లా పర్యాటకులు సందడి



**మొగల్తూరు ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కే.పీ. పాలెం పేరుపాలెం బీచ్ కి ఆదివారం జిల్లా నలుమూలలల నుండి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గడిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు బీచ్ ప్రాంతం పర్యాటకులతో కిటకిట లాడుతూ కనిపించింది. ఉదయం ఒకే చోట నుండి చూసిన సూర్యోదయం అదే ప్రాంతం నుండి సాయంత్రం 6 గంటలకు పడమర వైపు సూర్యాస్తమయం కనిపించడం పర్యాటకులలో ఆనందం కనిపించింది.

# రెండు ద్విచక్రవాహనాలు డీ- ఒకరికి గాయాలు



**చౌడేపల్లి,ఆగస్టు11(ఆంధ్రపత్రిక):** మండలంలోని సింగిరి గుంట సమీపంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయం లో గోపి(21)కలికిరి నుండి తమ పిన్ని వాళ్ళ ఇంటికి ద్విచక్ర వాహనం లో వస్తుండగా సింగిరిగుంట సమీపం లో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఒకదాన్ని ఒకటి డీ కొన్నాయి.అందులో గోపి కి కుడికాలు పాదం పూర్తిగా దెబ్బతి న్నది. క్షతగాత్రులను స్థానికులు 108 సహాయం తో చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ప్రథమచికిత్స నిమిత్తం తరలించారు.

ఆ సమయం చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో ఒక స్టాఫ్ నర్సు,ఆఫీస్ సబార్డినేట్ మాత్రమే అందుబాటులో ఉన్నారు.ఆ సమయం లో మెడికల్ ఆఫీసర్ ను చరవాణి లో సంప్రదించగా నీట్ ఎగ్జామ్ లో ఉన్నట్లు తెలిపారు.

వైద్యులు అందుబాటులో లేనందున మెరుగైన చికిత్సకోసం మదన పల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

# 16న నారాయణగిరి శ్రీవారి పాదాల చెంత ఛత్రస్థాపనోత్సవం

**తిరుమల, ఆగస్టు11(ఆంధ్రపత్రిక):** తిరుమలలోని నారాయణగిరి శ్రీవారి పాదాల చెంత ఈ నెల 16వ తేదీన ఛత్రస్థాపనోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా అర్చక బృందం శ్రీవారి పాదాలకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏడాదికోసారి ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

పురాణ ప్రాశస్త్యం ః తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తయిన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామివారు మొదటగా కాలు మోపినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా శ్రావణ శుద్ధ ద్వాదశి నాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి మరో నమ్మకం కూడా ఉంది. సాధారణంగా ఈ కాలంలో గాలులు ఎక్కువగా వీస్తాయి. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండ డంతో మరింత ఎక్కువగా గాలులు వీస్తాయి. ఈ గాలుల నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్టిస్తారు. ఛత్రస్థాపనోత్సవం కొన్ని వందల సంవత్సరాలుగా జరుగుతోంది.

ఇందులో భాగంగా నారాయ ణగిరిలోని శ్రీవారి పాదాలకు తిరుమంజనానికి నిర్వహించేందుకు ఆలయంలోని బంగారు బావి నుండి తీర్థాన్ని తీసుకుంటారు. తిరుమల శ్రీవారి ఆలయంలో రెండవ గంట తర్వాత పూజ సామాగ్రి, పుష్పాలు, నైవేద్యానికి ప్రసాదాలు సిద్ధం చేసుకుంటారు. రంగనాయకుల మండపం నుండి గొడుగులతో మంగళ వాయిద్యాల నడుమ మహాప్రదక్షిణంగా మేదరమిట్ట చేరుకుం టారు. అక్కడినుండి అర్చకులు నారాయణగిరి శిఖరం చేరుకుని బంగారుబావి నుండి తెచ్చిన తీర్థంతో శ్రీవారి పాదాలకు తిరుమం జనం నిర్వహించి, అలంకారం, పూజ, నైవేద్యం సమర్పిస్తారు. తదనంతరం వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించి, శ్రీవారి పాదాల చెంత గొడుగును ప్రతిష్టించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు.

## టీటీడీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ. 21కోట్ల భారీ విరాళం

**తిరుమల,ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** పంజాబ్‌లోని ట్రైడెంట్ గ్రూప్‌కు చెందిన శ్రీ రాజిందర్ గుప్తా ఆదివారం టీటీడీకి ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.21 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఆ మేరకు దాత చెక్కును టిటిడి అదనపు కార్యనిర్వహణాధికారి సి వెంకయ్య చౌదరికి తిరుమలలోని వారి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

## వి.కోట సీఐగా సోమశేఖర రెడ్డి



**వి.కోట ఆగస్టు11 (ఆంధ్రపత్రిక):** పలమనేరు నియోజకవర్గ పరిధి లోని వి.కోట మండల నూతన సీఐగా కర్నూలు వన్ టౌన్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సోమశేఖర్ రెడ్డి ఆదివారం సాయంత్రం భాద్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ సీఐగా ఉన్న లింగప్ప చిత్తూరుకు (వీఆర్) బదిలీపై వెళ్లారు.ఈ సందర్భంగా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పారదర్శకంగా తనవంతు భాద్యత నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

# అదే మానవాలికి శ్రీరామ రక్ష

### ఆదిమూలం గురుస్వామి



**చిలకలూరిపేట, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ ఆరవ వార్డ్ ప్రత్తిపాటి పుల్లారావు బైపాస్ రోడ్డు లో స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తూ,పల్నాడు జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం గురు స్వామి అధ్యర్యంలో అమ్మకు ఒక మొక్క అను భావం తో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా భావి తరాలకు నాటిన మొక్కలు గుర్తుండి పోతాయి అని ఆయన అన్నారు. స్థానిక ప్రజలు మొక్కలు నాటే కార్యక్రమం ను వృక్షో రక్షతి రక్షితః అని అభినందించారు. ఈ కార్యక్రమం లో పల్నాడు జిల్లా మైనారిటీ మోర్చ ఆద్యక్షలు అమ్మ జిలాని,బూత్ కమిటీ సభ్యులు షైక్ సుభాని మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్, పులి శ్రీనివాసరావు, నారాయణ దేవరకొండ, రాంబాబు, కరుణాకర్రావు, బొగ్గుల సుబ్బారావు పఠాన్ ఫరూక్,హరి కృష్ణా పాల్గొన్నారు.

## సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ




**రాజమహేంద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో గల సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ రూమ్ ను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆది వారం ఆకస్మికంగా తనిఖీ చేసి చేసారు. ఈ సందర్భంగా వాటి పనితీరు పై కంట్రోల్ రూమ్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ జి. ఉమామహేశ్వరరావుని అడిగి తెలుసుకుని, వారు చేయవలసిన విధులు పట్ల దిశా నిర్దేశం చేసినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా అంతట ఉన్న 481 సీసీ కెమెరాల పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని, వీటి ద్వారా జిల్లాలో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని అన్నారు. జిల్లా అంతటా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను 24Xపర్యవేక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా తమ ఇల్లు మరియు ఆఫీసు చుట్టుపక్కల ప్రైవేట్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇలా చేయడం ద్వారా భద్రతా, నిఘా పెంచుకోవచ్చని సూచించారు.

# మంత్రి అనితకు తప్పిన ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

అకస్మాత్తుగా బ్రేక్ వేశారు. దీంతో ఆ వాహనాన్ని మంత్రి ప్రయాణిస్తున్న కారు వెనుకనుంచి ఢీకొట్టింది. ఏలూ రు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. విజయవాడ నుంచి పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం అలంపురం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మంత్రి కారు, ఎస్కార్ట్ వాహనం స్వల్పంగా దెబ్బతిన్నాయి. అనంతరం అనిత మరో వాహనంలో వెళ్లారు.

# వచ్చిన వినతులను పరిష్కరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించారు. బ్లాక్-2లోని తన ఛాంబర్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీర్వచనాలిచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం దేవాదాయ శాఖకు సంబంధించిన పలు దస్త్రాలను ఆనం రామనారాయణ రెడ్డి పరిశీలించారు.గత ప్రభుత్వంలో తిరుమల నుంచి అరసవల్లి వరకు భూములు అన్యాక్రాంతం అయ్యాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆరోపించారు. ఇప్పు డు ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజాగళం, యువగళంలో వచ్చిన వినతులను పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్నికల హామీల మేరకు రూ.50 వేలకు తక్కువ ఆదాయం వున్న దేవస్థానాలకు ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నా మన్నారు. దీనికి సంబంధించి దేవాదాయ శాఖపై రూ.32 కోట్లు అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు.తప్పులు చేసిన వారిని వదిలేది లేదని మంత్రి హెచ్చరించారు. నెల్లూరు జిల్లాలో రెండు ఆలయాల్లో తప్పులు జరిగినట్లు నిర్ధరించి ఐదుగురు అధికారులను సస్పెండ్ చేశామన్నారు. వారిపై పూర్తి విచారణ జరుగుతోందని వివరించారు. కొన్ని దేవాలయాలను పునర్నిర్మించడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశంతో కృష్ణ, గోదావరి సంగమం వద్ద జలహారతి తిరిగి కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు.

# వెంటనే న్యాయం జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

(ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్) తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం.. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖను పంపించింది. ఆర్జీ కార్ మెడికల్ కళాశాల వైద్యులకు మద్దతుగా ఈ చర్యను చేపట్టినట్లు ప్రకటించింది. జూనియర్ వైద్యురాలి దారుణ హత్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫోర్డా నిన్న కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఇందుకు 24 గంటల డెడ్ లైన్ ఇచ్చింది. లేకపోతే ఆస్పత్రుల్లో సేవలను నిలిపివేస్తామని హెచ్చరించింది. దౌర్జన్యాలకు గురైన తమ వారికి న్యాయం జరగాలని పేర్కొంది. దీనికి రాజకీయ రంగు పులిమి ప్రతికూల కోణంలో చూడొద్దని అభ్యర్థించింది. అన్ని వర్గాలు వైద్యులకు మద్దతు ఇవ్వాలని కోరింది.పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఓ జూనియర్ వైద్యురాలు దారుణ హత్యకు గురయ్యారు. ఆమెపై లైంగిక దాడి చోటుచేసుకున్నట్లు ప్రాథమిక శవపరీక్షలో నిర్ధారణ అయింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ జూనియర్ వైద్యురాలు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఆమె మర్మాం గాలు, నోరు, కళ్ళ నుంచి రక్తస్రావం జరిగినట్లు శవపరీక్షలో తేలింది. శరీరంపై వివిధ చోట్ల గాయాలు కనిపించాయి. ఆమెపై హత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక తేల్చింది. మరోవైపు పోలీసులు ఈ కేసులో ఇప్పటికే ఓ పౌర వాలంటీర్ను అరెస్టు చేశారు. హత్యా స్థలంలో దొరికన ఓ బ్లూటూత్ ఆధారంగా అతడిని అదుపులోకి తీసుకొని హంతకు డిగా నిర్ధరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఆస్పత్రిలో ఉద్యోగుల రక్షణపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# కూలిపోయిన ట్రైనీ విమానం

(మొదటిపేజీ తరువాయి)

గుణ పోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జ్ దిలీప్ రాజోరియా వెల్లడించారు.విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లకు గాయా లయ్యాయి. గాయపడిన పైలట్లను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే టెస్టింగ్, నిర్వహణ కోసం కొన్ని రోజుల క్రితం పలు విమానాలు ఇక్కడికి చేరుకున్నాయని అధికారులు తెలిపారు. విమానం కూలి పోవటంపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

# నా ఫోన్ హ్యాక్ అయింది..

(మొదటిపేజీ తరువాయి)

సందేశాలు చేయొద్దు'. నేను మొబైల్ హ్యాక్‌కు సంబంధించి పోలీసు స్టేషన్‌కు వెళ్లి సాయం కోరాను' అని తెలి పారు.మరోవైపు.. ప్రహార్ జనశక్తి పార్టీ (పీజేపీ) అధ్యక్షుడు, అధికార మహాయుతి మిత్రపక్షం ఎమ్మెల్యే ఓంప్రకాష్ అలియాస్ బచ్చు కడు శనివారం పూణెలో ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌ను కలిశారు.శరద్ పవార్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికార మహాయుతితో ఉండాలా.. లేదా కూటమి నుంచి వైదొలుగాలా? అనే విషయంపై సెప్టెంబర్ 1న నిర్ణయం తీసుకుంటా నని అన్నారు. దీనిపై ఎంపీ సుప్రియా సూలే స్పందిస్తూ.. దివ్యాంగుల రాజకీయ సిద్ధాంతాలు భిన్నమై నప్పటికీ వారి పక్షాన కడు కృషి చేశారని కొనియాడారు. అదేవిధంగా రాష్ట్రాభివృద్ధికి అందరూ ఏకం కావాలని ఆమె కోరారు.

# హసీనా సంచలన ఆరోపణలు

(మొదటిపేజీ తరువాయి)

మార్టిన్ ద్వీపాన్ని అమెరికాకు ఇవ్వనందుకే ఈ పరిస్థితి నెలకొందని హసీనా చెప్పుకొచ్చారు.కాగా, మాజీ ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్‌ను వీడిన తర్వాత మొదటిసారిగా మాట్లాడారు. తాజాగా షేక్ హసీనా మీడియా సంస్థతో కీలక విషయాలను వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో తమ ప్రభుత్వ పతనానికి అమెరికానే కారణమని ఆరోపించారు. బంగాళాఖాతంలో అమెరికా ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలోనే బంగ్లాదేశ్ ప్రధానిగా ఉన్న తాను అడ్డుకోవడంతోనే అమెరికా ఈ పన్నాగం పన్నినట్లు చెప్పు కొచ్చారు. ఇక, బంగాళాఖాతంలోని సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని అమెరికాకు తాను అప్పగించనందుకే ఇలా అల్లర్లకు ప్రేరేపించినట్టు తెలిపారు.బంగ్లాదేశ్ విద్యార్థుల మృతదేహాలపై కొందరు అధికారంలోకి రావాలని కోరుకున్నారని.. కానీ దానికి తాను అంగీకరించలేదని షేక్ హసీనా స్పష్టం చేశారు. అలాగే, బంగ్లాదేశ్‌లో విద్యార్థుల మరణాలను చూడలేకనే రాజీనామా చేసినట్టు స్పష్టం చేశారు. ఒకవేళ తాను గనుక అమెరికాకు సెయింట్ మార్టిన్ దీవులను అప్పగించి ఉంటే ఇప్పుడు పరిస్థితులు మరోలా ఉండే దని అన్నారు. ఇదే సమయంలో ఛాందసవాదుల వల్ల బంగ్లాదేశ్ వాసులు తప్పుదోవ పట్టవద్దని విజ్ఞప్తి చేశారు. శాంతిని పెంపొందించాలని కోరారు. తాను అక్కడే ఉంటే మరింత విద్యార్థులు చనిపోయే వారిని ఆమె తెలిపారు. అందుకే దేశం విడిచి వెళ్లిపోయినట్టు స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా.. బంగ్లాదే శ్‌లో ఆందోళనలు పీక్ స్టేజ్ చేరుకోవడంతో నిరసనకారులు షేక్ హసీనా అధికారిక నివాసాన్ని ముట డించడంతో షేక్ హసీనా దేశాన్ని వీడారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో భారత్‌కు చేరుకున్నారు. ప్రస్తుతం షేక్ హసీనా ఇండియాలోనే ఉన్నారు. ఇతర దేశాల్లో ఆశ్రయం దొరక్కపోవడంతో ఢిల్లీలోనే ఉంటున్నారు.

# నిండుకుండలా సాగర్ జలాశయం

(మొదటిపేజీ తరువాయి)

పర్యాట కులకు మాత్రం నిరాశ ఎదురైంది. నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారి కొత్త అందాలను సంతరించుకుంది. వారం రోజులుగా ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. వరుస సెలవులు కావడంతో కృష్ణమ్మ పరవళ్ళను చూసేందుకు పర్యాటకులు నాగా ర్జునసాగర్‌కు తరలివస్తు న్నారు. సాగర్ వద్దకు వచ్చిన ప్రతి పర్యాటకుడు కృష్ణమ్మ అలలపై లాంచీ ప్రయాణం చేసి మధురమైన అనుభూతి పొందుతుంటారు. నాగార్జునసాగర్ నుండి నాగార్జున కొండకు పర్యాటకులను తీసుకువెళ్లే తెలంగాణ టూరిజం శాఖ లాంచీలను నిలిపి వేసింది. దీంతో సాగర్ సంద ర్శనకు వచ్చిన పర్యాటకులు నాగార్జున కొండను సందర్శించే అవకాశం లేకుండా పోయింది. కనీసం జాలీ ట్రిప్పులో సాగర్ జలాశయంలో విహరించే అవకాశం లేక నిరాశకు గురయ్యారు.విజయ విహార్ నుంచి లాంచీస్టేషన్‌ను నాలుగు రోజుల క్రితం డౌన్ పార్కు వద్దకు మార్చారు. రెండు రోజుల పాటు నాగార్జునకొండ, రిజర్వాయర్‌లో జాలీ ట్రిప్పులను నిర్వహించింది. ఏమైందో ఏమో కానీ తెలంగాణ టూరిజం నుండి ఒక్కసారిగా లాంచీల రాకపోకలు నిలిచి పోయాయి. సాగర్ డ్యాం జల విన్యాసాలను చూసిన సందర్శకులు లాంచీలో విహరిద్దామని గంటల తరబడి బోటింగ్ పాయింట్ వద్ద ఎదురు చూ శారు. అయితే సాగర్‌కు వరద ప్రవా హం ఎక్కువగా ఉండడంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా నాగా ర్జున కొండ, జాలీ ట్రిప్పులను నిలిపి వేయాలని అధికారులు ఆదేశించినట్టు లాంచి స్టేషన్ సిబ్బంది చెబుతున్నారు. దీంతో పర్యాటకులు నిరాశతో వెనుదిరిగారు.సాగర్ జలాశయంలో తెలంగాణ టూరిజం లాంచీల రాకపోకలు నిలిపివేసినా ఏపీ నుండి లాంచీలను నాగార్జున కొండకు యధావిధిగా నడుపు తోంది. ఆంధ్రా వైపు లాంచీలకు లేని వరద ప్రమాదం తెలంగాణకే ఉంటుందా అని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.

# ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. తుంగభద్ర డ్యామ్ సంఘటన ప్రదేశానికి చంద్రబాబు ఆదేశా లతో సెంట్రల్ డిజైన్ కమిషనర్‌తో పాటు ఇంజనీరింగ్ డిజైన్స్ బృందాన్ని కూడా ఏర్పాటు చేసి పంపించడం జరిగిందని నిమ్మల రామానాయుడు వెల్ల డించారు. ఈ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక డ్యాం గేటు కొట్టుకుపోయినందున ప్రజలను అప్రమత్తం చేసేలా జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. తుంగభద్రకు వరద పోటెత్తుతున్న నేపథ్యంలో కౌతాలం ,కోసిగి, మంత్రాలయం మరియు నందవరం మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి రామానాయుడు వెల్లడించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల అధికారులను అప్రమత్తంగా ఉండా లని హెచ్చరిం చడం జరిగిందని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. అధి,కార యంత్రాంగం అలెర్ట్ అత్యవసర సహాయంకోసం టోల్ ఫ్రీ 1070,112, 18004250101 సంప్రదించాలని సూచించారు.

# 15 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

**రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా**

**45 రోజుల పాటు నిర్వహణ .. మరో 45 రోజుల్లో పరిష్కారం**

**వైసీపీ భూ కబ్జాలు, రీ సర్వేతో వచ్చిన కష్టాలూ చెప్పుకోవచ్చు**

**ప్రజల నుంచి 5 కేటగిరీల్లో పిటిషన్ల స్వీకరణ**

**అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక) :** జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టిన భూ వివాదాల చిచ్చును పరిష్కరించేందుకు చంద్రబాబు ప్రభుత్వం నడుం బిగించింది. 'ప్రజల వద్దకే పాలన' తరహాలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. ఎక్కడికక్కడ అధికారులు భూ సమస్యలను తెలుసుకుంటారు. ఆగస్టు 15వ తేదీ నుంచి 45 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. మరో 45 రోజుల్లో సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తారు. గత ఐదేళ్లలో భారీగా భూ అక్రమాలు జరిగాయి. పేదలు, బడుగువర్గాలు, అణగారిన వర్గాల భూములను వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించుకొని రికార్డులను తారుమారుచేసి వారికి నరకం చూపించారు. ఇదేమిటని అడిగితే సమాధానం చెప్పే దిక్కులేదు. ఉద్దేశపూర్వకంగా వెబ్‌ల్యాండ్‌లో చిన్న, చిన్న మార్పులు చేసి ప్రజలను హింసించారు. కొత్త ప్రభుత్వం వచ్చాక స్వీకరిస్తోన్న వినతిపత్రాల్లో సగానికిపైగా భూ వివాదాలపైనే ఉంటున్నాయి. జగన్, ఆయన అనుయాయులు చేసిన పాపాలు సరిదిద్దకపోతే గ్రామాల్లో అరాచకం ప్రబలుతుందని, పేదల నోటికాడి ముద్దను తీసేసినట్లవుతుందని భావించిన ప్రభుత్వం తక్షణమే ఆ సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. 45 రోజులపాటు ఊరూరు తిరిగి అధికార యంత్రాంగాన్ని మోహరించి ఎక్కడికక్కడే సమస్యలు తెలుసుకోవడం, ఆ తర్వాత 45 రోజుల్లో వాటికి పరిష్కారం చూపడం...ఇదే ప్రస్తుత టార్గెట్. ఈ నెల 15న మంత్రులు లాంఛనంగా గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తారు. ఆ తర్వాత 16నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు అంటే 45 రోజుల పాటు సదస్సులు నిర్వహించనున్నారు. జిల్లాలు, మండలాల వారీగా గ్రామాల్లో సదస్సుల నిర్వహణ తేదీలను 13నాటికే ఖరారు చేయాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. సదస్సుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఓ సీనియర్ ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తారు. జేసీ నోడల్ అధికా రిగా వ్యవహరించనున్నారు. ఈ సదస్సుల్లో జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, సభ్యులు, మండల, గ్రామ ప్రజాప్రతిని ధులు పాల్గొనేలా కలెక్టర్‌లు తగిన చొరవ తీసుకో వాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు.



**సదస్సుల్లో ఏం చేస్తారంటే..**

గ్రామ రెవెన్యూ సదస్సుకు రెండు రోజుల ముందే ప్రభుత్వం గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు భూముల మ్యాప్‌లను ప్రకటిస్తుంది. సదస్సులకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, అటవీ, దేవదాయ, వక్ఫ్ శాఖల మండల, గ్రామస్థాయి అధికారులు హాజరవుతారు. భూ కొలతల్లో తేడాలు, సర్వేనెంబర్లలో మార్పులు, వారసత్వం పేర్ల నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డుల్లో నమోదైన తప్పులు, ప్రజల నుంచి వైసీపీ నేతలు లాక్కున్న భూములు, భూ కబ్జాలు, భూ ఆక్రమణలు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం వంటి తదితరాలపై బాధితుల నుంచి పిటిషన్లు తీసుకుంటారు. 2019కి ముందు భూమి రికార్డులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నా యో పరిశీలిస్తారు. అడంగల్, పహనీ, ఆర్‌ఓఆర్, 1బీ రిజిస్టర్, 22(ఏ) జాబితాలను అందుబాటులో ఉంచుతారు. వాటిపై ప్రజల నుంచే వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తారు. తహసీల్దార్ల నేతృత్వంలో అవసరమైతే భూములను పరిశీలన చేస్తారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఆర్‌ఓఆర్ రికార్డును ప్రజల సమక్షంలో చదివి వినిపించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు జగన్ బొమ్మలున్న పాస్‌పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని సూచించింది. జగన్ బొమ్మలున్న పాస్ పుస్తకాలను తహసీల్దార్లు ధ్వంసం చేయాలని రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడి యా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. గ్రామంలో జగన్ పేర్లు, బొమ్మలతో సర్వేరాళ్లు ఉంటే, వాటిపై పేర్లను చెరిపివేయాలని నిర్దేశించారు.

**ఐదు కేటగిరీలుగా..**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఐదు రిజిస్టర్లలో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 1.మ్యుటేషన్, 2.కౌలు రైతు కార్డులు(ఎల్‌ఈసీ), 3.భూమి వివాదాలు, 4.భూ ఆక్రమణ, 5.నిషేధ జాబితా 22(ఏ) గోల్‌మాల్ రిజిస్టర్లను నిర్వహిస్తారు. వీటిలో నమోదుచేసి, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. వీటిని ఆర్‌టీజీఎస్ విభాగం పర్యవేక్షిస్తుంటుంది. ఫిర్యాదు ఇచ్చిన ప్రజలకు వెంటనే ఓ రశీదు ఇస్తారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ అనేది ప్రభుత్వం చేపట్టిన పెద్ద టార్గెట్. దాన్ని విజయవంతం చేయాలంటే ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. అందుకే ప్రజాప్రతిని ధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించాలని ప్రభు త్వం ఆదేశించింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రైతు నేతలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, భూ సమ స్యలపై పనిచేస్తోన్న ఎన్‌జీవోలను పిలిచి సదస్సుల ఆవశ్యకతను తెలియజేయాలని, ఈ సదస్సులకు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించింది. జిల్లా, డివిజన్, మండల, గ్రామంవారీగా రెవెన్యూ సదస్సుల నిర్వహణ, వాటి లక్ష్యాలు తెలిపేలా ప్రచారం చేయాలని నిర్దేశించింది.

**90 రోజుల టార్గెట్: ఆర్పీ సిసోడియా**

ఈ నెల 15నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి పిటిషన్లు స్వీకరిస్తారు. ఆ తర్వాత మరో 45 రోజుల్లో అంటే నవంబరు 15 నాటికి వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. పిటిషన్ల స్వీకరణ, పరిష్కారం 90 రోజుల్లోనే పూర్తిచేయాలనేది లక్ష్యం. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనుంది. పిటిషన్ల స్వీకరణ, పరిష్కారంపై రోజువారీగా సమీక్ష చేయనున్నారు. అర్జీదారుకు ఫోన్‌చేసి పరిష్కారంపై వివరించాలని ఆదేశించారు. పర్యవేక్షణకు ఆర్టీజీఎస్ పరిధిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు.

**ప్రజల వద్దకే అధికారులు..**

రెవెన్యూ సదస్సుల పేరిట ఐదేళ్ల తర్వాత కీలక ప్రభుత్వ శాఖలు ప్రజల వద్దకు వెళ్లనున్నాయి. ఇది ప్రజల వద్దకు పాలనే అని సీనియర్ అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇంతకు ముందు అధికారుల వద్దకు ప్రజలు వెళ్లి గోడు చెప్పుకొనేవారు. దీంతో అధికారి స్వీకరించే పరిస్థితిని బట్టి పరిష్కారం ఉండేది. కానీ, ఇప్పుడు ప్రజల భూ వివాదాలు వినడానికే ఐదారుశాఖల అధికారులతో కూడిన బృందాలు రోజంతా గ్రామంలో మకాం వేయబోతున్నాయి. ఇందు లో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వామ్యం కాబోతున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పర్యవేక్షణ ఉంటోంది.

**ఎవరెవరు పాల్గొంటారు గ్రామ సదస్సులో...**

1.తహసీల్దార్, 2.రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, 3.గ్రామ రెవెన్యూ అధికారి, 4. మండల సర్వేయర్, 5. దేవదాయ, వక్ఫ్ శాఖల ప్రతినిధులు, 6. రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి, 7.అటవీ శాఖ అధికారి పాల్గొంటారు. సున్నితమైన భూసమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నందున కార్యక్రమం పూర్తయ్యేవరకు పోలీసులతో భద్రత ఏర్పాటు చేస్తారు.

# చంద్రబాబూ..రైతుల బాధలు పట్టవా..?

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకూ చెల్లించలేదు. దీనివల్ల రైతులకు ఉచిత పంటలబీమా చెల్లింపులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. 'ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియంను మా ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా ఏప్రిల్-మే నెలలో చెల్లించి నష్టపోయిన రైతులను జూన్‌లో ఆదుకున్నాం. ఖరీఫ్ పంట వేసే సమయానికి రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి సమర్థవంతంగా అమలు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించిన వెంటనే కేంద్రం కూడా వెంటనే తన వాటా కూడా విడుదలచేస్తుంది.ఇది జరిగిన సుమారు 30 రోజుల్లోగా బీమా కంపెనీ పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తుంది. ఇదే మాదిరిగా మా ప్రభుత్వ హయాంలో 54.55 లక్షల మంది రైతులకు గతంలో ఎన్నడూలేని విధంగా రూ.7,802 కోట్లు అందించి వారికి అండగానిలిచాం. తద్వారా ఉచిత పంటల బీమా విషయంలో మన రాష్ట్రం దేశంలో పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. అయితే 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎన్నికల కోడ్ కారణంగా ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయాయి. ఆతర్వాత వచ్చిన మీ ప్రభుత్వం వెంటనే స్పందించి చెల్లించాల్సి ఉన్నప్పటికీ దాని గురించి పట్టించుకో వడంలేదు." అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు."రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ప్రీమియం కట్టకపోవడంతో కేంద్రం కూడా తన వాటాను ఇప్పటికీ ఇవ్వలేదు. ఇప్పటికి జూన్, జులై మాసాలు గడిచిపోయాయి. ఆగస్టు నెలలో పక్షం రోజులు పూర్తికావొస్తున్నాయి.

# పోల్ సర్వేల్లో కమలా హారిస్ దూకుడు?

(మొదటిపేజీ తరువాయి)

పలు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న పోల్ సర్వేల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ఆధిక్యం లో ఉన్నట్లు సమాచారం. తాజాగా న్యూయార్క్ టైమ్స్, సియానా కాలేజ్ సంయుక్తంగా స్వింగ్ స్టేట్స్‌లో (విస్కాన్సిన్, పెన్సిల్వేనియా, మిచిగాన్) పోల్ సర్వేని నిర్వహించాయి. ఈ సర్వేలో కమలా 4 పాయింట్ల ఆధిక్యంతో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై ముందంజలో ఉన్నట్లు పేర్కొంది. ఆగస్టు 5-9 మధ్య నిర్వహించిన ఈ సర్వేలో మూడు రాష్ట్రాల్లో ట్రంప్‌కు 46 శాతం మద్దతు, కమలాకు 50 శాతం మద్దతు ఉన్నట్లు తెలిపింది.

# నవ దంపతులకు శుభవార్త

**అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పెళ్లయిన జంటలకు అదిరిపోయే శుభవార్త చెప్పింది. కొత్త రేషన్ కార్డుల విషయంలో కొత్త జంటలకు తీపి కబురు అందించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులకు సంబం ధించిన విధివిధానాలను రూపొందించడం మాత్రమే కాకుండా రేషన్ కార్డుల రంగులు కూడా మార్చనుంది. ఏపీలో త్వరలో అందరికీ పాత కార్డులు మార్చి కొత్త కార్డులు ఇవ్వడానికి రంగం సిద్ధం చేసింది ఏపీ సర్కార్. ఏపీలో ఉన్న రేషన్ కార్డులు ఇలా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోటి 48 లక్షల 43 వేల 671 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 89 లక్షల రేషన్ కార్డులకు ఆహార భద్రత చట్టం కింద కేంద్ర ప్రభుత్వం నిత్యవసర సరుకులను అందిస్తోంది. మిగిలిన 59,43,671 కార్డులకు రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చులను భరిస్తోంది. ఈ రేషన్ కార్డులకు కూడా కేంద్రం రేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. కొత్తగా చంద్రబాబు ఒకటే పథకం. 7 ప్రయోజనాలు! నూతన జంటలకు రేషన్ కార్డులు ఇలా ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా పెళ్లి అయిన జంటలు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటే వారికి కొత్త కార్డులు జారీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పెళ్లయ్యి తల్లిదం డ్రుల కార్డులో పేర్లు ఉన్నవారు కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వారికి పెళ్లి జరిగిందని వివాహ ధ్రువపత్రాన్ని సమర్పించి రేషన్ కార్డును పొందవచ్చని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. నవ దంపతులకు శుభవార్త చెప్పిన మంత్రి నాదెండ్ల దీంతో పెళ్లి చేసుకున్నట్టు వివాహ సర్టిఫికెట్ ఉంటే చాలు.. వారికి రేషన్ కార్డు ఇవ్వనున్నారు. నవ దంపతులు కుటుంబాల నుంచి వేరుపడిన తర్వాత పెళ్లి సర్టిఫికెట్ సమర్పిస్తే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. నూతనంగా పెళ్లి చేసుకున్న వారు రేషన్ కార్డుల కోసం ఇబ్బంది పడుతున్నట్టుగా గుర్తించామని, ఈ క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కచ్చితంగా రేషన్ కార్డులను జారీ చేస్తామని ఆయన వెల్లడించారు. చంద్రబాబు ప్రభుత్వం దారిద్ర రేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడానికి రెడీ అవుతోంది. సాధ్యమైనంత త్వరగా రేషన్ కార్డులు జారీ చేయాలని కూడా ఇప్పటికే సీఎం చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక ఇదే క్రమంలో ఏపీలో రేషన్ కార్డులు లేని నిరుపేదలకు, కొత్తగా పెళ్లి చేసుకున్న నవ దంపతులకు రేషన్ కార్డులు ఇవ్వనున్నారు అధికారులు.

## 109 రకాల కొత్త వంగడాలు

# విడుదల..

(మొదటిపేజీ తరువాయి)

ప్రాముఖ్యత వంటి అంశాలపై రైతులు, వ్యవసా య శాస్త్రవేత్తలతో చర్చించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా మోదీ వివరిం చారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రస్తుతం డిమా ండ్ పెరిగిందని, ప్రజలు అటువంటి ఆహారాన్ని ఇష్టపడుతున్నారని వెల్లడించారు. అదేవిధంగా కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే) కొత్త రకాల పంట ల గురించి, వాటి ప్రయోజనాల గురించి రైతు లకు ముందస్తు అవగాహన కల్పించాలని సూచిం చారు. ఈ కొత్త వంగడాలను అభివృద్ధి చేసిన వ్యవసాయ శాస్త్రవేత్తలను అభినందించారు.

# దేశంలో మరిన్ని ఎయిర్‌పోర్టులు అవసరం

(మొదటిపేజీ తరువాయి)

2026 నాటికి యీ ఎయిర్ పోర్టు నిర్మాణం పూర్తికావలసి వున్నప్ప టికీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఇటీవల భోగా పురం ఎయిర్ పోర్టు పర్యటనకు వచ్చినపుడు నిర్ణీత గడువుకంటే ఆరు నెలలు ముందుగా జూన్ 2026 నాటికి పూర్తిచేయాలని గడువు విధించారని ఆ సమయానికే పూర్తిచేసే దిశగా వేగవంతంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవితో కలసి ఆదివారం భోగా పురం ఎయిర్ పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనులను పరిశీ లించారు. జి.ఎం.ఆర్. గ్రూపు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.ప్రభా కరరావు వారికి పనుల పురోగతిని వివరించారు. కేంద్ర రాష్ట్ర మంత్రులు ముందుగా ఎయిర్ పోర్టు టెర్మినల్ భవనం వద్దకు చేరుకొని పనులను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముచ్చటించారు. అనంతరం టెర్మినల్ భవనం మొదటి అంతస్థుపైకి వెళ్లి అక్కడ జరుగుతున్న పనులను తెలుసుకున్నారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటిసి) టవర్ నిర్మాణం పనులను కూడా మంత్రులు పరిశీలించారు. అనంతరం రన్ వే నిర్మాణాన్ని పరిశీలిస్తూ ఎల్ అండ్ టి సంస్థ ప్రాజెక్టు స్థలానికి చేరుకున్నారు. అక్కడ నిర్మాణం పనులపై జి.ఎం.ఆర్. సంస్థ ప్రతిని ధులు ప్రజంటేషన్ ఇచ్చారు.అనంతరం మంత్రి రామ్మోహన్ నాయు డు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ నిర్మాణం పనుల పురోగ తిని వివరించారు. ప్రతి నెలా పనుల ప్రగతిని సమీక్షించి ప్రజలకు వివరిస్తామని స్పష్టంచేశారు. ఎయిర్ పోర్టు పనులు ఆగష్టు 11 నాటికి 36.6 శాతం పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. గత నెల జూలై 11 నాటికి 31.8 శాతం పనులు పూర్తికాగా గత నెల రోజుల్లో అదనంగా 4.8 శాతం పనులు జరిగాయని చెప్పారు. భారీ వర్షాలు నిరంతరాయంగా కురుస్తున్న సమయంలోనూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులు నిరాటంకంగా జరపడం వల్ల పనుల్లో యీ ప్రగతి సాధ్యమైందని పేర్కొంటూ జి.ఎం.ఆర్.సంస్థ ప్రతినిధులను, ఎల్ అండ్ టి ప్రతినిధులను మంత్రి అభినం దించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ యీ ఎయిర్ పోర్టు పనులు అనుకున్న సమయానికంటే ముందుగా పూర్తిచేసేందుకు ప్రత్యేక దృష్టి సారించి కృషిచేస్తున్నాయని చెప్పారు.



వాస్తవానికి ముందు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం యీ సమయానికి 20శాతం పనులు పూర్తికావలసి వుండగా నేడు 36.6 శాతం పూర్తికావడం జరిగిందన్నారు.ఎయిర్ పోర్టు నిర్మాణంలో ముఖ్యమైన ఎర్త్ వర్క్ పనులు గత నెలలో 97.1శాతం జరుగగా నేటికి 98శాతం పూర్తయినట్టు చెప్పారు. రన్ వే పనులు గత నెల ఇదే సమయానికి 32శాతం పూర్తికాగా ఈరోజు నాటికి 38.67శాతం పూర్తయినట్టు తెలిపారు. టాక్సీవే పనులు గత నెలలో 16.7 శాతం జరగగా, ఈరోజు నాటికి 20.78శాతం పూర్తయినట్టు పేర్కొన్నారు. టెర్మినల్ భవనం పనులు గత నెలలో 22.5 పూర్తికాగా ఈరోజుకు 27.2 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఏటిసి నిర్మాణం పనులు గత నెలలో 25.58శాతం పూర్తికాగా నేడు 30.69శాతం పూర్తయినట్లు చెప్పారు. సబ్ స్టేషన్‌లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు వంటి నిర్మాణాలు 6 నుంచి 12 శాతం మేరకు పూర్తయి నట్లు తెలిపారు.ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేశక్తి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వుందని తాను బలంగా నమ్ముతున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. అందుకే దీనికి అంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతం తమకు ఆదరించి ఎంతో గొప్ప విజయాన్ని అందించిందని, యీ ప్రాంత ప్రజలు తమపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ఇక్కడి ప్రాజెక్టులకు అధికంగా ప్రాధాన్యత ఇస్తామని ఇటీవల భోగా పురం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని మంత్రి గుర్తు చేశారు.ప్రధానమంత్రి నరేంద్రమోడి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశంలో యీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఆర్.సి.ఎస్. ఉడాన్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, యీ పథకం ద్వారా మనదేశ పౌరవిమానయాన రంగం ప్రపంచంలోనే ఉన్నతస్థాయికి వెళ్లే అవకాశం ఉందని కేంద్ర పౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఏ రంగంలోనూ లేనివిధంగా యీ రంగంలో 16శాతం వృద్ధిరేటు నమోదవుతోందన్నారు. నవీ ముంబాయి, నోయిడా వద్ద నిర్మిస్తున్న కొత్త ఎయిర్ పోర్టులను వచ్చే ఏప్రిల్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో పౌరవిమానయాన రంగంలో గణనీయమైన పురోగతి సాధిస్తామ న్నారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎయిర్ పోర్టుల వసతులను గణనీ యంగా పెంచేందుకు తమ మంత్రిత్వశాఖ కృషి చేస్తుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా మూల పేట, దగదర్తి, నాగార్జున సాగర్, కుప్పం ఎయిర్ పోర్టులతో పాటు అనంతపూర్, ఒంగోలులో కూడా కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వున్నాయని, వీటిని పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణలో హైదరాబాద్ మినహా మరో ఎయిర్ పోర్టు లేదని, కొత్తగూడెం, అదిలాబాద్, వరంగల్ వంటి ప్రాంతాల్లో నిర్మాణానికి ప్రతిపాదనలు పరిశీస్తామన్నారు.విశాఖలో రైల్వే జోన్ అతి త్వరలో ఏర్పాటు కానుందని తాను భావిస్తున్నట్టు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. రైల్వే శాఖకు రాష్ట్ర ప్రభుత్వం విశాఖ నగరంలో ఇచ్చేందుకు ప్రతిపాదించిన 52 ఎకరాల స్థలం ఎంతో అనువుగా వుందని, రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం సానుకూలంగా వుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర అధికారులు సంయుక్తంగా సమావేశమై రైల్వే జోన్ ఏర్పాటుకు ఇచ్చిన స్థలాన్ని పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టారని, త్వరలోనే విశాఖ రైల్వేజోన్ పనులు ప్రారంభమవుతాయని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే తాను, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు యీ విషయమై రైల్వే మంత్రితో చర్చలు జరిపామన్నారు.ఎయిర్ పోర్టు నిర్మాణ ప్రాంతం వద్ద కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతిరాజు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలిశారు. యీ పర్యటనలో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జి.ఎం.ఆర్. గ్రూపు డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్ ఐ.ప్రభాకరరావు, జిఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ సి.ఇ.ఓ. మన్మోయ్ రాయ్, ప్రాజెక్టు హెడ్ (కార్పొరేట్ రిలేషన్స్) బి.హెచ్.ఏ. రామరాజు, చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 50 రోజుల్లో 53 వేల ఫిర్యాదులు



ఫిర్యాదుల్లో ఎక్కువశాతం రెవెన్యూ సంబంధిత సమస్యలే

గ్రామాల్లోని త్రాగునీటి సమస్యలపైనా పెద్ద ఎత్తున ఫిర్యాదులు

**అమరావతి,ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):**ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ (ఎన్డీఏ) కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాదర్బార్ మొదలు పెట్టారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు.. వారి నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అందులో భాగంగానే మంత్రులు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వారానికి రెండ్రోజులు టైమ్ టేబుల్ వేసుకుని మరీ వింటున్నారు. సీఎం చంద్రబాబు సైతం తనవంతుగా వెళ్లి ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు స్వీకరించారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నడుస్తున్న ఈ ప్రజాదర్బార్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు పోటెత్తాయి. రాష్ట్ర నలుమూల నుంచి 50 రోజుల్లో 53 వేల ఫిర్యాదులు రావడం చర్చనీయాంశమైంది. ఇక ఈ ఫిర్యాదుల్లో ఎక్కువశాతం రెవెన్యూ సంబంధిత సమస్యలే ఉన్నట్లు తెలుస్తోంది. భూ ఆక్రమణ కేసులు, భూ కబ్జా కేసులే అధికంగా ఉన్నట్లు సమాచారం. అలాగే గ్రామాల్లోని త్రాగునీటి సమస్యలపైనా పెద్ద ఎత్తున ఫిర్యాదులందినట్లు తెలుస్తోంది. మరోవైపు గత ప్రభుత్వంలో అక్రమ కేసులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపైనా అర్జీలు అందినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను తీసుకొచ్చింది ఏపీ ప్రభుత్వం. ప్రజల నుంచి అందిన అర్జీని తక్షణమే ఆన్‌లైన్ చేసి.. సంబంధిత శాఖలకు వెంటనే పంపి సమస్య పరిష్కారం దిశగా అడుగులేస్తోంది. ఈ వ్యవస్థ కోసం పార్టీ కేంద్ర కార్యాలయంలోని సెకండ్ ఫ్లోర్‌లో ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు సీఎం ఆదేశాలతో మంత్రులు సైతం ప్రజా ఫిర్యాదులను చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారు.



# విఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో ఘనంగా జాతీయ లైబ్రేరియన్ల దినోత్సవం

**అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** విఐటీ-ఏపీ యూనివర్సిటీ లైబ్రరీ, బుక్‌బజ్ క్లబ్ సహకారంతో, ఆగస్టు 10, 2024న జాతీయ లైబ్రేరియన్ల దినోత్సవాన్ని జరుపుకుంది. డాక్టర్ 132వ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీ లైబ్రరీ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్ఆర్ రంగనాథన్, భారతదేశంలో లైబ్రరీ సైన్స్ పితామహుడు మరియు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన లైబ్రరీ సైన్స్ ప్రొఫెసర్. ఈ సందర్భంగా విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వి.పుల్లారెడ్డి ఎస్.వి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి విశ్వవిద్యాలయం. డాక్టర్ రెడ్డి తన అంతర్దృష్టితో కూడిన ప్రసంగంలో, ఏటా జాతీయ లైబ్రేరియన్ల దినోత్సవాన్ని జరుపుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వర్గీకరణ మరియు కేటలాగింగ్ వ్యవస్థల అభివృద్ధి, వివిధ విశ్వవిద్యాలయాలలో లైబ్రరీ సైన్స్ కోర్సులను స్థాపించడం మరియు విభిన్న విషయాలపై అతని విస్తృతమైన రచనలతో సహా ఈ రంగానికి డాక్టర్ రంగనాథన్ చేసిన స్మారక సహకారాన్ని ఆయన ప్రస్తావించారు. డాక్టర్ రంగనాథన్ ప్రభావం మద్రాసు విశ్వవిద్యాలయం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం మరియు ఢిల్లీ విశ్వవిద్యాలయం వంటి ప్రముఖ సంస్థలలో ప్రొఫెసర్ మరియు లైబ్రేరియన్‌గా అతని పదవీకాలం వరకు విస్తరించింది. ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ మరియు వివిధ అంతర్జాతీయ లైబ్రరీ సంస్థలలో అతని కీలక పాత్ర అతని వారసత్వాన్ని మరింత పటిష్టం చేస్తుంది. పద్మశ్రీ గౌరవం మరియు నేషనల్ రీసెర్చ్ ప్రొఫెసర్ హోదాతో సహా డాక్టర్ రంగనాథన్ సాధించిన విజయాలను డాక్టర్ రెడ్డి వివరించారు. అతని పని అనేక పిహెచ్‌డిలకు దారితీసింది. పరిశోధనలు మరియు ప్రచురణలు, గ్లోబల్ లైబ్రరీ సైన్స్ కమ్యూనిటీపై అతని శాశ్వత ప్రభావాన్ని ప్రతిబింబిస్తాయి. డాక్టర్ రెడ్డి లైబ్రరీ వనరులను ఆఫ్‌లైన్‌లో మరియు ఆన్‌లైన్‌లో ఉపయోగించుకోవాలని హాజరైన వారిని ప్రోత్సహించారు. ఇది డా.రంగనాథన్ యొక్క శ్రేష్ఠత పట్ల ఉన్న అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. వైస్ ఛాన్సలర్ డా.ఎస్.వి.కోటా రెడ్డి సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, దృఢమైన పరిశోధనా సంస్కృతిని పెంపొందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతను నొక్కి చెప్పారు.



వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఏజెన్సీల మద్దతు ద్వారా అకడమిక్ ప్రచురణలను మరియు పేటెంట్లను పొందడంలో విశ్వవిద్యాలయం యొక్క పురోగతిని వివరించాడు. అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు మరియు విద్యార్థులలో పరిశోధన మరియు ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలను డాక్టర్ రెడ్డి వివరించారు. యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ సిహెచ్. వీరాంజనేయులు తన ప్రారంభ ప్రసంగంలో, విద్యా మరియు వృత్తిపరమైన వృద్ధికి గ్రంథాలయ వనరులను ఉపయోగించడం యొక్క ప్రాముఖ్యతను పునరుద్ఘాటించారు. అతను ప్రీమియర్ ఇ-జర్నల్స్, ఇ-బుక్స్ మరియు సైన్స్డైరెక్ట్, ఐఇఇఇ (ఐఇఎల్), స్ప్రింగర్, స్కోపస్ మరియు వెబ్ ఆఫ్ సైన్స్ వంటి డేటాబేస్‌లకు సబ్‌స్క్రిప్షన్‌లతో సహా అందుబాటులో ఉన్న విస్తృతమైన వనరులను హైలైట్ చేశాడు. సాంప్రదాయ ముద్రణ సామగ్రికి అదనంగా. డా. వీరాంజనేయులు వివిధ విస్తరణ కార్యక్రమాల ద్వారా వనరుల వినియోగాన్ని పెంపొందించడానికి లైబ్రరీ కొనసాగుతున్న కార్యక్రమాలను కూడా గుర్తించారు. డాక్టర్ రంగనాథన్ యొక్క శాశ్వతమైన వారసత్వాన్ని గౌరవించడంలో విశ్వవిద్యాలయ సంఘం యొక్క సామూహిక ప్రయత్నాలను పురస్కరించుకుని, హృదయపూర్వక ధన్యవాదాలతో మరియు జాతీయ గీతాన్ని అందించడంతో కార్యక్రమం ముగిసింది.

# రాష్ట్ర అభివృద్ధిలో యువత పాత్ర ముఖ్యం



కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రపత్రిక):** అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు ఆంధ్రప్రదేశ్ కు వచ్చి రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలి. మరెందరికో స్ఫూర్తిగా నిలవాలి. ఐ.టి., ఇతర సాంకేతిక రంగాల్లో స్థిరపడాలనుకునే విద్యార్థులకు మద్దతుగా ఉండాలి.' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని స్థానిక బృందావన్ గార్డెన్స్ లో ఫాంగ్ టెక్ ల్యాబ్ ఐటీ ట్రైనింగ్ సెంటర్ ను పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం సంస్థ నిర్వాహకులు జాగర్లమూడి వెంకట్ ట్రైనింగ్ సెంటర్ వివరాలను పెమ్మసానికి వివరించారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ అమెరికాకు వెళ్లాలనుకునే విద్యార్థిని, విద్యార్థులకు ఐ.టీ రంగంలో మరింత నైపుణ్యతతో కూడిన కోచింగ్ ను అందించడంలో భాగంగా ఈ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సరైన గైడెన్స్ లేక అమెరికా వెళ్లిన విద్యార్థులు పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి కంపెనీలలో ట్రైనింగ్ తీసుకుని వెళితే అమెరికాలో ఇబ్బందులు పడాల్సిన అవసరం రాదని తెలిపారు. ఒక ప్లానింగ్ ప్రకారం మూడు నెలలకు ఒకసారి 50 మందికి ప్యాకేజ్ గా శిక్షణ అందిస్తారని పెమ్మసాని అన్నారు. 50 మందితో ప్రారంభమైన ఈ ట్రైనింగ్ సెంటర్ 500 మందికి చేరాలని కోరుకుంటున్నాను అని తెలుపుతూ నిర్వాహకులు వెంకట్ కు పెమ్మసాని అభినందనలు తెలియజేశారు.



# అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ

**విజయవాడ,(ఇంద్రకీలాద్రి) ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):** శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారి దర్శనార్థం విశేషంగా విచ్చేస్తున్న భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లును ఎప్పటికప్పుడు ఆలయ అధికారులు పరిశీలించారు. ఉదయం నుండి మ.3.30గం.ల వరకు కూడా అత్యధిక సంఖ్య లో భక్తులు విచ్చేశారు. ఆదివారం కావడంతో లోకాసంరక్షణార్థం దేవస్థానం నందు సూర్యోపాసన సేవ నిర్వహించడం జరిగినది. రద్దీ రోజురోజుకు పెరుగుచున్నందున ఆలయ కార్యాలయం సిబ్బందికి కూడా రద్దీని అనుసరించి, శుక్ర, శని, ఆదివారాలు మరియు ప్రత్యేక రోజులలో రద్దీ క్రమబద్ధీకరణకు గాను ప్రత్యేక విధులు కేటాయించగా, సిబ్బంది అందరూ ప్రత్యేక విధులలో పాల్గొని భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడం జరిగినది. ప్రత్యక్షంగా దేవస్థానంనకు వచ్చి అమ్మవారి పూజా కార్యక్రమాలలో పాల్గొనలేని భక్తులు ఇప్పుడు వారి ఇంటివద్ద నుండే ఆన్ లైన్ ద్వారా (పరోక్ష) సేవలు/పూజలు తమ గోత్ర నామముల తో వారు కోరిన రోజున జరిపించుకొని, దుర్గామల్లేశ్వర స్వామివార్ల కృపా కటాక్షములకు పాత్రులు అగుటకు దేవస్థానం వారు అవకాశం కల్పించారు. ఆలయ యూట్యూబ్ ఛానెల్ నందు భక్తులు ఈ పరోక్ష సేవలను వీక్షించవచ్చును. భక్తులు ఈ సదావకాశమును పూర్తిగా వినియోగించుకొన వలసినదిగా ఆలయాధికారులు తెలిపారు. అమ్మవారి దర్శనార్థం విచ్చేయు భక్తులు ఆన్‌లైన్ నందు www.kanakadurgamma.org అను వెబ్‌సైట్ ద్వారా ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకొని వారికి కేటాయించిన స్లాట్ నందు త్వరిత గతిన మరియు సులభతరంగా అమ్మవారి దర్శనం పొందవలసినదిగా ఈవో కోరారు.









ఒంగోలులో యం.హెచ్. ఫంక్షన్ హాలులో జరిగిన నూతన ఆర్య వైశ్య సంఘ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవంలో పాల్గొన్న ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి సిద్ధా రాఘవ రావు, మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్, పలువురు ఆర్య వైశ్య సభ్యులు, తదితర నాయకులు.





మాగుంట కార్యాలయంలో పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన బండ్లమిట్ట కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ,వారి భర్త బేతంశెట్టి హరిబాబు, మధు మరియు తదితర నాయకులు...

# ప్యాలెస్ నుంచి ప్రజల ముందుకు పాలన



- చేతులు మారిన భూముల మీద విచారణ సాగుతోంది
- టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**అమరావతి,ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):** ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రాష్ట్ర ప్రజలు మరో స్వాతంత్ర్యం వచ్చిందన్న సంతోషంలో ఉన్నారని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్యాలెస్ నుంచి పాలన ప్రజల ముందుకు చేరుతోందన్నారు. చేతులు మారిన భూముల మీద విచారణ సాగుతోందని, ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల బంద్ పాటు ల్యాండ్ మాఫియాకు పెద్ద షాక్ తగిలిందని తెలిపారు. మదనపల్లె ఫైల్‌ను మించిన సర్వేపల్లి కోర్టు చోరీ ఫైల్స్ వంటి ఘోరాలున్నాయని చెప్పారు. ఇలాంటివన్నీ ఈ నెల 15వ తేదీ నుంచి మొదలయ్యే 'ప్రజల వద్దకు పాలన' సదస్సులతో వెలుగులోకి రానున్నాయని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నిర్ణయాలతో పాప ప్రక్షాళన జరగబోతుందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

# ఏపీలో రైతులకు శుభవార్త

**విజయవాడ, ఆగస్టు 11(ఆంధ్రపత్రిక):**ఏపీలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తర్వాత పాలనను పరుగులు తీయస్తున్నారు. గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న లోటుపాట్లను పరిశీలించి అవి తమ ప్రభుత్వంలో తలెత్తకుండా జాగ్రత్తగా అమలుచేసుకుంటూ వస్తున్నారు. కొద్దిరోజుల క్రితమే రైతులకు సూక్ష్మ సేద్య పథకాన్ని ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం తాజాగా అన్నదాతల కోసం మరో నిర్ణయాన్ని అమలు చేయబోతోంది. ఈ-పంటలో నమోదైన రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపచేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రైతులకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను చంద్రబాబు ప్రభుత్వం వరుసగా సమీక్షించుకుంటూ వస్తోంది. దీనిలో భాగంగానే పంట బీమా నమోదులో అన్నదాతల వ్యయప్రయాసలను తగ్గించేందుకు ఈ-పంటలో నమోదైతే చాలు అని ప్రకటించింది. వచ్చే రబీ సీజన్ నుంచి 2019లో వైసీపీ ప్రభుత్వం రాకముందు ఏ విధానమైతే ఉందో దాన్ని వర్తింపచేస్తోంది.ఈ విధానాన్ని మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది. ఇప్పటికే రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, పంటల బీమా కోసం గత ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను పూర్తిచేసిందని, ఇప్పుడు తిరిగి టెండర్లు పిలిస్తే ప్రక్రియ చాలా ఆలస్యమవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన అన్నదాతలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న ఖరీఫ్ సీజన్‌కు పాత విధానమే అమలు చేసి వచ్చే రబీ సీజన్ నుంచి కొత్త విధానం అమలు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు నిర్ణయించారు.



విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వరద ప్రవాహంలో చేపలకోసం వల విసురుతున్న మత్స్యకారుడు

ఆంధ్రపత్రిక ఫోటో: సిహెచ్.విజయభాస్కర్

Printed and Published by KANCHARLA RAMAIAH behalf of Nageswara Rao Estates Private Limited, Printed at jagati publication Limited. Sakshi Press, Survey No 86/10, Madhurawada village, MCV Limits, Visakhapatnam - 530041, (AP), Published at D.No50-39-5/A, NORTH EXTENSION LAYOUT, NEAR STATE BANK OF HYDERABAD, SEETAMMADHARA, VISAKHAPATNAM-530013 Editor:KANCHARLA RAMAIAH.Excutive editor V.VIJAYALAKSHMI. RNI NO.10721/65 CELL 9849998069, Email:andhrapatrikadaily@gmail.com